E KABURU - Digital News Paper
E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 25-02-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:55|| పేజీలు–6 www.ekaburu.com



పోలవరం ఏజెన్సీలో


## పులి కలకలం

....(2లో)

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల బిగ్ అప్డేట్..

## అధికారుల తర్జన భర్జన..?

- 'ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై అప్డేట్
- బీసీ రిజర్వేషన్ ల అంశం కేంద్రం తేల్చాకే ఎన్నికలు
- ఎందుకు ఈ తర్జన భర్జన?
- ఆగస్టు వరకు ఆగాల్సిందేనా..?



**ఈ కబురు :**
రాష్ట్రంలో ఇటీవల ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు ముగిశాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలలో ఘన విజయం సాధించి దూసుకుపోయింది. 80 శాతానికి పైగా స్థానాలను గెలుచుకొని మంచి విజయోత్సాహంతో పార్టీ శ్రేణులు ఉన్నారు. అయితే ఇదే సమయంలో mptc, zptc ఎన్నికలను కూడా త్వరగా నిర్వహించాలని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. కానీ ఈ అంశం పైన రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు.

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై అప్డేట్**

తాజాగా రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని బట్టి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఇప్పట్లో జరిగే అవకాశం లేదని తెలుస్తోంది. క్యాబినెట్ భేటీలో ఈ అంశం చర్చకు రాగా బీసీ రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపిన కారణంగా దానిపైన కేంద్ర నిర్ణయం కోసం వేచి చూద్దామని సీఎం రేవంత్ మంత్రులతో పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం తేలిన తర్వాతే ఎలక్షన్లకు వెళదామని సీఎం రేవంత్ చెప్పినట్టు సమాచారం.

....(మిగతా2లో)

# సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ

# కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం



- 'సేవా తీర్థ్' నూతన ప్రాంగణంలో ప్రధాని మోదీ అధ్యక్షతన తొలి కేబినెట్ సమావేశం
- దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాకు ఆమోదం
- కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చేందుకు గ్రీన్ సిగ్నల్
- భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు 'సేవా సంకల్ప్'
- రూ.12,236 కోట్లతో రైల్వే, మెట్రో సహా పలు మౌలిక ప్రాజెక్టులకు ఆమోదముద్ర

**ఈ కబురు :**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన 'సేవా తీర్థ్' సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును 'కేరళం'గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. దీంతో పాటు, రాబోయే రోజుల్లో భారత్‌ను ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలబెట్టడమే లక్ష్యంగా 'సేవా సంకల్ప్' పేరిట ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. నేడు 'సేవా తీర్థ్' ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశం దేశ ప్రగతి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది అని కేబినెట్ అభివర్ణించింది. వలసవాద గతం నుంచి ఆత్మవిశ్వాసంతో కూడిన నవ భారతం వైపు సాగుతున్న ప్రయాణానికి ఈ నూతన పరిపాలనా కేంద్రం ఒక శక్తివంతమైన చిహ్నమని తీర్మానంలో పేర్కొన్నారు. 'సేవా తీర్థ్' అనే పేరు సేవ, బాధ్యత, అంకితభావాలకు ప్రతిరూపమని, ఇక్కడ పరిపాలనను ఒక పవిత్ర యాత్రగా భావిస్తామని వివరించారు.

....(మిగతా2లో)



2

సీఎం రేవంత్‌పై

## హరీష్ రావు ఫైర్

- రియల్ ఎస్టేట్ మీద ఉన్న సోయి.. పేద ప్రజలపై లేదు

**ఈ కబురు ; తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు కేంద్ర బిందువైన 'ఫ్యూచర్ సిటీ'పై ఉన్న శ్రద్ధ, పేద ప్రజలకు ప్రాణం**



3

## హాల్ టికెట్ ఉంటే.. కోరిన చోట బస్సు ఆపండి

**ఈ కబురు, హైదరాబాద్: పరీక్షలు జరిగే రోజుల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ హాల్ టికెట్లు చూపిస్తే కోరిన చోట బస్సు ఆపేలా వెసులుబాటు కల్పించింది.**

## తెలంగాణలో పుట్టుక.. తెలంగాణలోనే అంతం!

- మావోయిస్టుల్లో మిగిలిన తెలంగాణ వాళ్లు 11 మందే..: డీజీపీ శివధర్‌రెడ్డి
- వాళ్లు కూడా టచ్‌లో ఉన్నారు.. చర్చలు జరుగుతున్నాయి..
- వాళ్లు కూడా లొంగిపోతే తెలంగాణ వారంతా బయటికి వచ్చినట్టే..
- సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు,ప్రభుత్వ పాలసీ నేపథ్యంలో అంతా లొంగిపోతున్నారు
- కీలక నేత గణపతి షెల్టర్ జోన్‌లో ఉన్నట్టు సమాచారం ఉందన్న డీజీపీ



**ఈ కబురు ,హైదరాబాద్**
తెలంగాణలో మొదలైన మావోయిస్టు ఉద్యమం.. తెలంగాణలోనే అంతానికి వచ్చిందని డీజీపీ బి.శివధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం తెలంగాణకు చెందిన 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని, అయితే దాదాపుగా వారంతా తమకు టచ్‌లోకి వచ్చినట్టు తెలిపారు. చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే వారు కూడా జనజీవన స్రవంతిలోకి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. ఈ 11 మంది లొంగిపోతే మావోయిస్టుల్లో ఉన్న తెలంగాణ వారంతా బయటికి వచ్చినట్టే అవుతుందన్నారు.

....(మిగతా2లో)

## త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'



- రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానం చేయడమే లక్ష్యం
- ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా కొత్త విధానం రూపకల్పన
- రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకురావాలి
- పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం

**ఈ కబురు ,హైదరాబాద్**
తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో త్వరలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు శ్రీకారం చుట్టబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

....(మిగతా2లో)

## రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు

## .. అప్పుడు మీ సంగతి చెప్తా

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బెదిరింపులు, భౌతిక దాడులు
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తుంది
- విర్రవీగిన వారు త్వరలో చిప్పకూడు తింటారు ; కేటీఆర్



ఈ కబురు ; రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని మున్సిపల్ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బెదిరింపులు, ప్రలోభాలు, భౌతిక దాడులకు దిగి ప్రజల తీర్పును అపహాస్యం చేసిందని ఆయన మండిపడ్డారు.

....(మిగతా2లో)

## ఐదు నిమిషాల వరకు అనుమతి

- ఇంటర్ మీడియేట్, ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఐదు నిమిషాల వరకు అనుమతి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు



**ఈ కబురు, హైదరాబాద్ :**
రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్ మీడియేట్ ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం తర్వాత ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతినిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పీ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నేడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య , పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

....(మిగతా2లో)

## తెలంగాణ విద్యార్థులకు

ప్రపంచ స్థాయి నైపుణ్యం అందిస్తాం

- మంత్రి వివేక్ వెంకటస్వామి



ఈ కబురు ; తెలంగాణలో రాబోయే రోజుల్లో 120 కొత్త అడ్వాన్స్డ్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ విద్యార్థులకు ప్రపంచ స్థాయి నైపుణ్యం అందిస్తామని చెప్పారు.

....(మిగతా3లో)

హిందూ ధర్మంపై దాడి జరిగితే...

# ముక్త కంఠంతో ఖండించాలి

**శాసనసభలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంపై జరిగిన చర్చలో పవన్ కళ్యాణ్**



**ఈ కబురు, అమరావతి :**
**'భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటం అత్యంత తీవ్రమైన నేరం.**

ఈ నేరానికి పాల్పడిన బాధ్యులకు శిక్ష పడాలి. ఈ కేసులో దోషులను కూటమి ప్రభుత్వం కచ్చితంగా శిక్షిస్తుంద'ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కుట్ర జరిగిందన్నారు. నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని చెబితే, సీబీఐ నేతృత్వంలోని సిట్ చేపట్టిన విచారణలో నెయ్యిలో అసలు నెయ్యే లేదని తేల్చినట్టు చెప్పారు. పామాయిల్, ఇతర రసాయనాలు కలిపి తయారు చేసినట్టు స్పష్టమైన ఆధారాలు లభించాయి... ఇది శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేయడమేనన్నారు. అరాచకాల్లోనూ నూతన ఆవిష్కరణలు చేసిన ఘనత గత పాలకులకే దక్కుతుందనీ, పాల నుంచి కాకుండా రసాయనాలతో నెయ్యి తయారు చేయొచ్చని వారు చేసి చూపారని చెప్పారు.

....(మిగతా3లో)

## దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా

## HPV వ్యాక్సిన్

- 14 ఏళ్లు పైబడిన బాలికలకు ఉచితంగా వ్యాక్సిన్
- ఈ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్ లను నిరోధిస్తుంది



ఈ కబురు : గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్ (HPV vaccination)ను దేశవ్యాప్తంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది.

....(మిగతా3లో)

## రామ్మోహన్‌తో కిషన్‌రెడ్డి భేటీ



- .. విమానాశ్రయాల నిర్మాణంపై చర్చ

ఈ కబురు, హైదరాబాద్: పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి, వివిధ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు.

....(మిగతా2లో)

ఈ-కబురు

25- 02 -2026
బుధవారం
E-kaburu.com

### ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల బిగ్ అప్డేట్..

# అధికారుల తర్జన భర్జన..?

**పార్టీకి మరింత పట్టు**

కొందరు మంత్రులు ఎన్నికలకు వెళ్దామని పేర్కొనగా, మరి కొందరు కొన్ని రోజుల వరకు వెయిట్ చేస్తే బాగుంటుందని అభిప్రాయాలను వెల్లడించారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగినందున, ఇదే జోష్ పై వెళ్లాలని కొందరు మంత్రులు అభిప్రాయాలను తెలియజేశారు. ఆలస్యం చేయకుండా పరిషత్ ఎన్నికలు కూడా పూర్తి చేస్తే గ్రామ స్థాయిలో పార్టీకి మరింత పట్టు వస్తుందని వెల్లడించారు. కానీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, అలాగే బీసీ రిజర్వేషన్ల(BC Reservations) పై సాగుతున్న కసరత్తు లు పూర్తి కాకుండా ఎన్నికలకు వెళ్లడం వల్ల నష్టం జరిగే అవకాశం కూడా ఉన్నట్లు మరి కొందరు స్పష్టం చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ముందుకు సాగుదామని ఇంకొందరు తమ అభిప్రాయాలను స్పష్టం చేసినట్లు తెలిసింది. మంత్రుల మధ్య డిఫరెంట్ ఓపినియన్లు రావడంతో తుది నిర్ణయానికి మరి కొంత సమయం పట్టే ఛాన్స్ ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**ఆగస్టు వరకు ఆగాల్సిందేనా..?**

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఒక సాంకేతిక చిక్కు ఎదురవుతోంది. ఒకవేళ ఇప్పుడే నోటిఫికేషన్ ఇచ్చి ప్రక్రియ పూర్తి చేయకపోతే ఆలస్యమయ్యే అవకాశం మేజూన్ నెలల్లో ఎండలు, వడగాల్పుల తీవ్రత కారణంగా ఎన్నికలు నిర్వహించడం అసాధ్యమని ప్రభుత్వం భావిస్తుంది. అంతేగాక మార్చి నెలలో వరుసగా విద్యార్థులకు ఎగ్జామ్స్ కూడా ఉన్నాయి. ఆ తర్వాత జూలైలో వర్షాలు మొదలవుతాయి. ఈ నేపథ్యంలో మార్చిలో నిర్వహించకపోతే మళ్లీ ఆగస్టు వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అధికారులు కేబినెట్ కు వివరించినట్లు తెలుస్తోంది. ఈ గ్యాప్ లో రైతు భరోసాతో పాటు గ్రామ స్థాయిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీంతో ప్రభుత్వానికి మరింత మైలేజ్ వస్తుందనే ఆశను సర్కార్ వ్యక్త పరుస్తుంది.

**ఎందుకు ఈ తర్జన భర్జన?**

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు కేవలం స్థానిక నాయకత్వానికి సంబంధించినవి మాత్రమే కావు. ఇవి భవిష్యత్తులో రాబోయే సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్స్ లాంటివని కాంగ్రెస్ ఆలోచిస్తున్నది. ఈ నేపథ్యంలో బీసీ కులగణన నివేదిక రాకుండా, పెంచిన రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్తే బీసీ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నదని టెన్షన్ పడుతున్నారు. అంతేగాక రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో, నిధుల కేటాయింపులు,పథకాల అమలుపై ఫోకస్ పెట్టాల్సిన సమయంలో ఎన్నికల కోడ్ అడ్డు రావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్(BRS), బీజేపీ(BJP) వంటి పార్టీలు కూడా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకతను సాకుగా చూపి పుంజుకోవాలని అవి భావిస్తుండగా, ఆ అవకాశం ఇవ్వకూడదని అధికార పార్టీ యోచిస్తోంది. కేబినెట్ భేటీలో వీటన్నింటిపై చర్చలు జరిగినప్పటికీ, తుది నిర్ణయాన్ని ముఖ్యమంత్రికి వదిలేసినట్లు సమాచారం.

## త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

రాష్ట్రంలో పెట్టుబడిదారులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేలా, ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిచేలా అందరితో చర్చించి ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. గ్రోత్ అంటే యాదృచ్ఛికంగా వచ్చేది కాదని, భావితరాల భవిష్యత్తు కోసం శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగానే రాష్ట్రప్రభుత్వం 'తెలంగాణ విజన్ 2047'ను రూపొందించిందన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న తెలంగాణను, 2034నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ''క్యూర్‌ప్యూర్‌రేర్'' అనే త్రిముఖ వ్యూ హాన్ని అమలు చేస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాల ను వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. ఏఐ, ఇండస్ట్రీ 5.0 లాంటి టెక్నాలజీస్‌తో వర్క్ కల్చర్‌లో మార్పు వచ్చిందని, రాబోయే రోజుల్లో కంపెనీల కంటే ''ఎకో సిస్టం''కే ప్రాధాన్యత ఉంటుందన్నారు. పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే వ్యవస్థలా కాకుండా, వారితో కలిసి నడిచే భాగస్వామిగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రముఖ వైద్యుడు డా.నాగేశ్వర్ రెడ్డి, ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, స్కై రూట్ ఏరోస్పేస్ ప్రతినిధి పవన్, గ్రోత్ ఎక్స్ 2026 కన్వీనర్ పంకజ్ దివాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదు నిమిషాల వరకు అనుమతి

ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ , ఫిబ్రవరి 25 వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని , గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత విజిలెంట్ గా ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్ ల సౌకర్యాలు కల్పించడంతో పాటు సి.సి టీవీ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రం లో ఒక ఏ.ఎన్.ఎం , ఫస్ట్ ఎయిడ్ కిట్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదని అన్ని కేంద్రాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,239 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్ లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే ఎమర్జెన్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ప్రతీ పరీక్ష ప్రశ్న పత్రానికి ప్రత్యేకంగా Q.R కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందని పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగా మాత్రమే ప్రశ్నా పత్రాలను ఓపెన్ చేయాలని స్పష్టం చేసారు.ఈసారి మొదటి సారిగా విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్ సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు.

## రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు
## .. అప్పుడు మీ సంగతి చెప్తా



మంగళవారం ఆదిలాబాద్ సెంట్రల్ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఇతర బీఆర్ఎస్ నాయకులను పరామర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు, రాష్ట్ర పోలీసులకు కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది కేసీఆర్ అని.. అప్పుడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని విర్రవీగిన వారందరూ చిప్ప కూడ తింటారని హెచ్చరించారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని పోలీసుల ద్వారా అక్రమ కేసులు బనాయించడం తీవ్ర అభ్యంతరకరమని ఆయన స్పష్టం చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో మొత్తం ఇరవై రెండు స్థానాలకు గాను బీఆర్ఎస్ పది, సీపీఐ నాలుగు స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ సాధించినా, కేవలం ఏడు సీట్లు గెలిచిన కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడి పీఠాన్ని లాగేసుకునే కుట్ర చేసిందని విమర్శించారు. కౌన్సిలర్లను ప్రలోభపెట్టేందుకు ఒక్కొక్కరికి మూడు కోట్ల మేర ఆఫర్ చేశారని, వారు లొంగకపోవడంతో దాడులకు దిగారని కేటీఆర్ ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదని, తమ వారిని వేధిస్తున్న అధికారులను వదిలిపెట్టబోమని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

### సేవా తీర్థ్ లో తొలి కేబినెట్ భేటీ

# కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం



ఈ సమావేశంపై ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ.. "స్వదేశీ ఆలోచన, ఆధునిక దృక్పథం, 140 కోట్ల ప్రజల అపార సామర్థ్యంతో భారతదేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు సంకల్పం చేశాం" అని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాల్లో భాగంగా, బాలికల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక (హెచ్‌పీవీ) 'గర్దాసిల్' టీకాను అందించే కార్యక్రమానికి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా, కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించింది. మౌలిక సదుపాయాల కల్పనకు ఊతమిస్తూ సుమారు రూ.12,236 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో అహ్మదాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టు, జబల్‌పూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు కూడా ఆమోదం లభించింది. ప్రభుత్వ పరిపాలన అధికార కేంద్రంగా కాకుండా, ప్రజల సాధికారతకు కేంద్రంగా పని చేయాలని 'సేవా సంకల్ప్' తీర్మానంలో స్పష్టం చేశారు. 'నాగరిక దేవో భవ' (పౌరుడే దైవం) అనే సూత్రాన్ని పాటిస్తూ, ప్రతి నిర్ణయం 140 కోట్ల ప్రజల సేవకే అంకితమవుతుందని పేర్కొన్నారు. గత దశాబ్దంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడాన్ని గుర్తుచేస్తూ.. 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' వేగంతో భారత్‌ను త్వరలోనే ప్రపంచంలోని టాప్3 ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు దృఢ సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం మీద, ఈ సమావేశం 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక బలమైన పునాది వేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు

## సీఎం రేవంత్‌పై హరీష్ రావు ఫైర్



పోసే వరంగల్ 'హెల్త్ సిటీ'పై ఏమాత్రం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పార్టీ నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే 24 అంతస్తుల భవన నిర్మాణం దాదాపు పూర్తికాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పనులను కావాలనే పక్కనపెట్టారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న అక్కసుతోనే ఈ ఆసుపత్రి నిర్మాణాన్ని నత్తనడకన సాగిస్తున్నారని విమర్శించారు. కేవలం కమీషన్లు తెచ్చిపెట్టే ప్రాజెక్టులపైనే సీఎం దృష్టి సారించారని, పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే ఆసుపత్రులను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. వెంటనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోతే వరంగల్ గడ్డపైనే బీఆర్ఎస్ పక్షాన ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# తెలంగాణలో పుట్టుక.. తెలంగాణలోనే అంతం!



మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి (అప్రకటిత) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మదాదా, కేంద్ర కమిటీ సభ్యుడు మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్నలు సాయుధ పోరాటాన్ని వదిలి మంగళవారం డీజీపీ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అదనపు డీజీలు మహేశ్ భగవత్, అనిల్‌కుమార్, విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్, ఐజీ సుమతితో కలిసి శివధర్‌రెడ్డి మాట్లాడారు.

**కీలక నేతలు లొంగిపోతున్నారు..**

'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు, తెలంగాణ సరెండర్ పాలసీ కారణంగా ఎంతో మంది మావోయిస్టు కీలక నేతలు లొంగిపోతున్నారు. గత రెండేళ్లలో ఇప్పటివరకు నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు సహా మొత్తం 544 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. మొత్తంగా చూస్తే ఇప్పటివరకు 5,865 మంది లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులపై కేసుల విషయంలో సానుభూతితో వ్యవహరిస్తాం. వారి హక్కులను కాపాడేందుకు ప్రయత్నిస్తాం. అవసరమైతే వారి ప్రాణాలకు మా ప్రాణాలు అడ్డువేస్తాం. మాకున్న సమాచారం ప్రకారం..మావోయిస్టు కేంద్ర కమిటీలో కీలకంగా ఉన్న ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి అడవుల బయట షెల్టర్‌లో ఉన్నారు.

ప్రస్తుతం మావోయిస్టు కేంద్ర కమిటీలో గణపతి, పుసునూరి నరహరి, బిప్రా అలియాస్ సాగర్ మాత్రమే మిగిలి ఉన్నారు..' అని డీజీపీ తెలిపారు. మావోయిస్టుల లొంగుబాటులో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐబీ చీఫ్ సుమతి, ఆమె బృందాన్ని, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్నామన్నారు. కాగా లొంగిపోయిన మావోయిస్టులు తిప్పిరి తిరుపతి, మల్ల రాజిరెడ్డిలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున, బడే చొక్కారావు, నూనె నర్సింహారెడ్డిలకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ పునరావాస పథకం కింద డీజీపీ అందజేశారు.

**తెలంగాణ నుంచి మిగిలిన 11 మంది వీళ్లే..**

కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, ఈస్ట్ డివిజనల్ బ్యూరో సభ్యుడు, మావోయిస్టు టెక్నికల్ విభాగం ఇన్‌చార్జి పుసునూరి నరహరి అలియాస్ సంతోష్, ఒడిశా స్టేట్ కమిటీ సభ్యుడు ముప్పిడి సంబయ్య అలియాస్ సుదర్శన్, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ, కమ్యూనికేషన్ విభాగం ఇన్‌చార్జి వార్త శేఖర్ అలియాస్ మంగ్తు, గణపతి భార్య..మాడ్ డివిజన్ ఇన్‌చార్జి జోడే రత్నాభాయ్ అలియాస్ సుజాత, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఎడ్యుకేషన్ కమిటీ ఇన్‌చార్జి లక్కా సుశీల అలియాస్ రేల, దేవ్‌జీతో పాటు కంప్యూటర్ ఆపరేటర్ అనిల్‌కుమార్ అలియాస్ భగత్‌సింగ్, మాడ్ డిజినల్ కమిటీ డీసీఎం రంగబోయిన భాగ్య అలియాస్ రూపీ, చర్లలో ఏసీఎం మడివి అడిమె అలియాస్ సంగీత, దేవ్‌జీ టీంలో పనిచేసే కాశపోగు భవానీ అలియాస్ సుగుణ, ఇల్లెందు నర్సంపేట ఏరియా కమాండర్ కుంజం ఇడామల్.

## ఏపీ, తెలంగాణపై ద్రోణి ప్రభావం

- జిల్లాలో ఈదురు గాలులతో భారీ వర్షా లు
- మరో మూడు రోజులు వర్షా లు..
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక

**ఈ కబురు, హైదరాబాద్;**



ఉపరితల ద్రోణి ప్రభావంతో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో అకస్మాత్తుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి,వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి పొడిగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం కాగానే ఒక్కసారిగా మబ్బులతో కమ్ముకుంది. వేగంగా ఈదురు గాలులు వీచి అనేక జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. మరో మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది.హైదరాబాద్ తో సహా ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. అటు ఏపీలోనూ పలు ప్రాంతాల్లో ఆకస్మిక వర్షాలు కురుస్తున్నాయి. బంగాళా ఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి దక్షిణ అంతర్గత కర్ణాటక ప్రాంతం నుంచి మరాట్వాడా వరకు ద్రోణి ఒకటి సగటు సముద్ర మట్టం నుంచి 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఏర్పడినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో తెలగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో వర్షం కొనసాగుతోంది. నగరంలోని ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్, చిక్కడపల్లి, గాంధీనగర్ తో సహా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. మేడ్చల్ జిల్లాలో ఉదయం నుంచి పొడిగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం కాగానే ఒక్కసారిగా మబ్బులతో కమ్ముకుంది. రాబోయే మూడు రోజుల పాటు తెలంగాణలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇక, అనేక జిల్లాల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి.ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి యాసంగి పంటలు గోధుమ, మొక్కజొన్న పంట లు నేలకొరిగి తీవ్రంగా దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. జయశంకర్ భూపాలపల్లి మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో అకాల వర్షంతో జన జీవనం ఒక్కసారిగా స్తంభించింది. ఉరుములు మెరుపులతో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షాల కారణంగా మర్చి రైతులకు భారీ నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దుబ్బాక పట్టణంలో వర్షం బీభత్సం సృష్టించింది. భారీ ఈదురు గాలులతో పలు ప్రాంతాల్లోని చెట్లు నేలకొరిగాయి. జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, వడగళ్ల వాన కురిసింది. మంచిర్యాల జిల్లా మందమర్రిలోనూ అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. కాగా మంగళవారం ఆదిలా బాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

## రామ్మోహన్‌తో కిషన్‌రెడ్డి భేటీ



వరంగల్, ఆదిలాబాద్, పెద్దపల్లిలో విమానాశ్రయ ప్రాజెక్టులు, రాష్ట్రంలో ప్రతిపాదిత, పనులు జరుగుతున్న విమానాశ్రయ ప్రాజెక్టులపై చర్చించారు. ప్రాజెక్టుల పూర్తికి తీసుకోవాల్సిన చర్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంపై మంత్రులు సమీక్షించారు. పరిపాలన, సాంకేతిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వరంగల్ విమానాశ్రయం కోసం 9,533 ఎకరాలు అందుబాటులోకి వచ్చిందని అధికారులు వివరించారు. 2,500 మీటర్ల రన్‌వే నిర్మించనున్నట్లు తెలిపారు. డిజైన్, స్కోప్ ఆఫ్ వర్క్, డీపీఆర్ ఖరారు ప్రక్రియ తుదిదశలో ఉందని అధికారులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. జూన్‌లో శంకుస్థాపనకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి భూసేకరణ ఇంకా ప్రారంభం కాలేదని, రన్‌వేకు రక్షణశాఖ భూములు వినియోగించనున్నామని తెలిపారు. విమానయాన, రక్షణ శాఖలు విధివిధానాలు ఖరారు చేస్తాయన్నారు. పెద్దపల్లిలో విమానాశ్రయం నిర్మాణానికి 980 ఎకరాలు గుర్తించామని, దీనికి సంబంధించి ఫీజిబిలిటీ స్టడీ జరుగుతోందని ఏఏఐ ఛైర్మన్ వివరించారు.

## పోలవరం ఏజెన్సీలో పులి కలకలం



ఈ కబురు ; ఏజన్సీ ప్రాంతంలో పులి భయం ప్రజలను వీడటం లేదు. పోలవరం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో మరోసారి పెద్దపులి సంచారం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవల పట్టుకుని పాపికొండలు అభయారణ్యంలో విడిచిపెట్టిన పులే మళ్లీ జనారణ్యం వైపు వస్తుండటంతో స్థానిక గిరిజన గ్రామాల్లో ఆందోళన నెలకొంది. గత రెండు రోజులుగా రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ఈ పులి కదలికలను అటవీశాఖ అధికారులు గుర్తించి, నిఘా ముమ్మరం చేశారు.కొద్ది రోజుల క్రితం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పశువులపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేసిన ఈ పులిని అటవీ అధికారులు ఈ నెల మొదటి వారంలో ఎంతో శ్రమించి బంధించారు. అనంతరం విశాఖపట్నం జూకు తరలించి, చికిత్స అనంతరం ప్రత్యేక కమిటీ నిర్ణయం మేరకు పాపికొండలు అభయారణ్యంలో పులిని సురక్షితంగా తిరిగి విడిచిపెట్టారు. అందుకు సంబంధించి వీడియోలను మీడియాకు విడుదల చేశారు.అయితే, అభయారణ్యంలో వదిలిన పది రోజుల్లోనే ఈ పులి మళ్లీ జనావాసాల సమీపంలోకి వచ్చింది. ప్రస్తుతం రంపచోడవరం మండలంలోని గెద్దాడ, చిలకమామిడి, బూసిగూడెం అటవీ ప్రాంతాలతో పాటు మారేడుమిల్లి పరిధిలోని పలు గ్రామాలకు సమీపంలో సంచరిస్తున్నట్టు అధికారులు తెలిపారు. పులి సంచారంతో అటవీ శాఖ నిఘా పెంచింది. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు వివరించారు. పులి సంచారం నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, పొలాలకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## హాల్ టికెట్ ఉంటే..
### కోరిన చోట బస్సు ఆపండి



ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 14వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనుండటంతో.. పరీక్షల సమయంలో అదనంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నట్టు ఆర్టీసీ అధికారులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు బస్సుల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం అధికారులను ఆదేశించారు. పరీక్షల సమయంలో స్టాప్ లేకున్నా.. కోరిన చోట బస్సులు ఆపి విద్యార్థులను దింపేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

## తెలంగాణ విద్యార్థులకు
### ప్రపంచ స్థాయి నైపుణ్యం అందిస్తాం



మంగళవారం (ఫిబ్రవరి 24) రంగారెడ్డి జిల్లా నందిగామ కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన ఇండియా స్కిల్ రీజనల్ కాంపిటేషన్ 2025-26 ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి.. యువత విద్యతో పాటు ఏదో ఒక కొత్త రంగంలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కాంపిటేషన్ లో సౌత్ ఇండియా లోని 5 రాష్ట్రాలు.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు పుదుచ్చేరి,లక్షద్వీప్ లకు చెందిన 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ తో పాటు నగదు ప్రోత్సాహం అందజేశారు. 3డి డిజిటల్, అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోనమస్ మొబైల్ రోబోటిక్, బ్యూటీతెరఫీ, బ్రిక్ లేయింగ్, కేబినెట్ మేకింగ్, కార్పెంటరీ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన సౌత్ ఇండియా విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందించారు మంత్రి వివేక్.

# నల్లగండ్ల డివిజన్ ప్రజల కష్టాల్లో
# అండగా ఉంటా : పల్లపు సురేందర్



మహిళలు, వృద్ధులకు ప్రెషర్ కుక్కర్లను అందజేస్తున్న పల్లపు సురేందర్



మహిళలు, వృద్ధులకు ప్రెషర్ కుక్కర్లను అందజేస్తున్న పల్లపు సురేందర్

### ఇచ్చిన హామీ మేరకు డివిజన్ ప్రజలకు ప్రెషర్ కుక్కర్ల పంపిణీ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి**

: నల్లగండ్ల డివిజన్ ప్రజలకు ప్రతి సందర్భంలోనూ అండగా ఉంటానని వారి కష్టసుఖాల్లో పాలుపంచుకొని తన వంతు సహకారం అందజేస్తానని నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ అన్నారు. నల్లగండ్ల డివిజన్ వ్యాప్తంగా చేపట్టిన పాదయాత్రలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు డివిజన్ ప్రజలకు ప్రెషర్ కుక్కర్ల పంపిణీ చేపట్టారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలకు ప్రెషర్ కుక్కర్లను అందజేశారు. ఈ సందర్భంగా పల్లపు సురేందర్ మాట్లాడుతూ నల్లగండ్ల డివిజన్ ప్రజల ముఖాల్లో చిరునవ్వులు చూడడమే ధ్యేయంగా ముందుకు సాగుతానని అన్నారు. ముఖ్యంగా నల్లగండ్ల డివిజన్ అంటే అభివృద్ధి చెందిన గేటెడ్ కమ్యూనిటీ లతోపాటు నేటికీ పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోని బస్తీలు, కాలనీలు ఉన్నాయన్నారు. డివిజన్ వ్యాప్తంగా గతంలో చేపట్టిన పాదయాత్రలో పేద, మధ్యతరగతి ప్రజల ఇబ్బందులను స్వయంగా గమనించానని, వారికి తన చేతనైన సహాయం చేయాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చానన్నారు. డివిజన్ వ్యాప్తంగా పేదింటి మహిళల కళ్ళల్లో ఆనందం చూసేందుకు మహిళలకు ప్రెషర్ కుక్కర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. నల్లగండ్ల డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని, డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రెషర్ కుక్కర్ల పంపిణీలో పల్లపు సురేందర్ తో పాటు నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## యూట్యూబర్ తో..
# ప్రేమ... బ్రేక్అప్...
### మనస్థానంతో మహిళా యూట్యూబర్ ఆత్మహత్య

**ఈ-కబురు, శేరిలింగంపల్లి**

ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఓ విద్యార్థిని యూట్యూటర్ గా రాణిస్తూ మరో యూట్యూబర్ తో ప్రేమలో పడింది. ఇద్దరి మధ్య ఏర్పడిన విభేదాలతో సంవత్సర కాలంగా దూరంగా ఉంటుండగా, ప్రేమ బ్రేక్ఆప్ తో మనస్థాపానికి గురైన యూట్యూబర్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...



ఆత్మహత్య చేసుకున్న కోమలి (ఫైల్)

మణికొండ చిత్రపురి కాలనీలో గల ఎల్ ఐజీ ఫ్లాట్ నెంబరు 404లోని తన మామ ఇంట్లో ఉంటున్న కోమలి బోను (21) మల్లారెడ్డి యూనివర్సిటీలో బిఎస్ సి చదువుతుంది. కాగా పార్ట్ టైమ్ లో యూట్యూబ్ వీడియోలు చేస్తూన్న కోమలి యూట్యూబర్ గా పేరు తెచ్చుకుంది. కాగా సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ యూట్యూబర్ గా రాణిస్తున్న అఖిల్ రెడ్డితో కోమలికి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో మూడేళ్లుగా ఇద్దరు ప్రేమించుకోగా, ఇద్దరి మధ్య ఏర్పడిన విభేదాలతో గత సంవత్సర కాలంగా ఇద్దరు బ్రేక్అప్ చెప్పుకొని విడిపోయారు. కాగా కోమలి మాత్రం అఖిల్ రెడ్డితో ఏర్పడిన విభేదాలతో మనస్థాపానికి గురై గతంలో ఆత్మహత్యకు యత్నించగా, కుటుంబ సభ్యులు సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడారు. అఖిల్ ను మర్చిపోలేక పోయిన కోమలి గత రెండు రోజుల క్రితం ఫోన్ చేయగా, ఇద్దరి మధ్య వాగ్వాగం జరిగింది. దీంతో మనాస్రపానికి గురైన కోమలి ఈనెల 23వ తేదీన రాత్రి చిత్రపురి కాలనీలోని తన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# దేశవ్యాప్తంగా బాలికలకు
# ఉచితంగా HPV వ్యాక్సిన్



ప్రత్యేక టీకా కార్యక్రమంలో భాగంగా 14ఏళ్ల వయసు పైబడిన బాలికలకు ఉచితంగా అందించనున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా గార్డాసిల్ ఇంజెక్షన్ ను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ వ్యాక్సిన్ నాలుగు రకాల గర్భాశయ క్యాన్సర్లను నిరోధిస్తుంది. ఈ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ టైప్ 16, 18 తోపాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఒక డోసు వ్యాక్సిన్ అందించడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాల రక్షణ కల్పిస్తుందని దేశీయంగా, అంతర్జాతీయంగా జరిపిన శాస్త్రీయ పరిశోధనల్లో తేలింది. జాతీయ కార్యక్రమంలో భాగంగా దీన్ని స్వచ్ఛందంగా, ఉచితంగా అందివ్వనున్నారు. 15ఏళ్ల లోపు బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గార్డాసిల్ 4 టీకాను రెండు డోసుల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర. 3,927. అదే 15 ఏళ్ల వయసు పైబడిన బాలికలు మాత్రం మూడు డోసుల్లో తీసుకోవాలి. ఈవ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసులో అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడోస్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా..వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

# జీతాలు ఇవ్వడం లేదనే కోపంతోనే చోరీ

- ఏ క్షణమైనా దొరుకుతానని... చోరీ సొమ్ముతో జల్సాలు...
- గోవన్ పల్లి ఏటీఎం డబ్బు చోరీ నిందితుడి అరెస్టు
- రూ.34.90 లక్షలు స్వాధీనం



నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి**

తాను పనిచేస్తున్న సీఎంఎస్ సంస్థ ఉద్యోగులకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తోందని కోపం పెంచుకున్న డ్రైవర్ సంస్థ డబ్బు చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు... అదను కోసం 20రోజుల పాటు వేచి చూసి సందు దొరికిన వెంటనే ఏటీఎంలలో నింపే డబ్బు, వాహనంతో ఉడాయించాడు... తాను ఏ క్షణమైనా పోలీసులకు దొరికిపోతానని ముందే నిర్ణయానికి వచ్చిన నిందితుడు చోరీ చేసిన సొమ్ముతో మద్యం తాగుతూ, ఖరీదైన హోటళ్లలో ఉంటూ జల్సాలు చేశాడు... రాష్ట్రాలు, నగరాలు తిరుగుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరిగిన గోపనపల్లి ఏటీఎం డబ్బు చోరీ డ్రైవర్ చివరికి పట్టుబడ్డాడు. శంషాబాద్ లో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతని వద్ద నుంచి చోరీ నగదు 34.90లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసుకు సంబంధించిన వివరాలను గచ్చిబౌలి డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నార్సింగి ఏసిపి రమణకుమార్ వెల్లడించారు...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా రాయదుర్గ పరిధిలోని బొమ్మనహల్ గ్రామానికి చెందిన బడిగ్రి అజిత్ కుమార్(34) నగరంలోని సికింద్రాబాద్ లో నివాసం ఉంటూ గత ఆరు నెలలుగా సంగం సెక్యూరిటీ సర్వీసెస్ లో పనిచేస్తున్నాడు. ఏటీఎంలలో డబ్బులు నింపే సీఎంఎస్ వ్యాన్ కు డ్రైవర్ గా కొనసాగుతున్న అజిత్ కుమార్ తమ సంస్థ ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వేదిస్తుండడంతో కోపం పెంచుకున్నాడు. కళ్ల ముందు రోజు లక్షల రూపాయల నగదు కనిపిస్తుండడంతో వాటిని చోరీ చేసి తమ సంస్థపై ప్రతీకారం తీర్చుకోవాలని భావించాడు. దాదాపు 20 రోజుల పాటు సమయం కోసం వేచి చూశాడు. కాగా ఫిబ్రవరి 11వ తేదీన గోపన్ పల్లిలో ఏటీఎంలో డబ్బు నింపేందుకు సీఎంఎస్ వాహనంతో డ్రైవర్ అజిత్ కుమార్ రాగా, సిబ్బంది ఏటీఎం లోపలికి వెళ్లారు. అదే సమయంలో సెక్యూరిటీ గార్డు బాత్రూమ్ కు వెళ్లగా, ఇదే అదనుగా భావించిన అజిత్ కుమార్ సిఎంఎస్ వ్యాన్ తో అక్కడి నుంచి పరారయ్యాడు. సిబ్బంది ఫోన్ చేస్తే పక్కనే టీ తాగుతున్నానని చెప్పి రెండు గంటల పాటు మభ్యపెట్టాడు. ఈ క్రమంలో సీఎంఎస్ వాహనంతో అమీన్ పూర్ గద్దర్ సర్కిల్ వరకు వెళ్లి, వ్యాన్ ను వదలిపెట్టి, అందులో డబ్బుతో ఉన్న ఇనువ డబ్బాను తీసుకొని ఆటోలో పారిపోయాడు. లింగంపల్లి సర్కిల్ వరకు వచ్చి అక్కడి నుంచి మియాపూర్ కు, అక్కడి నుంచి ఆర్టిసి క్రాస్ రోడ్డుకు బస్సులో వెళ్లాడు. అక్కడ లాడ్జీలో గది అద్దెకు తీసుకొని యాక్సా బ్లేడుతో ఇనుప బాక్సును తెరిచి, అందులో ఉన్న 56 లక్షల రూపాయల నగదును బ్యాగులో నింపుకొని బస్సులో అనంతపూర్ వెళ్లాడు. అక్కడి నుంచి బల్లారి, బెంగళూరు, అనంతపూర్ తదితర ప్రాంతాలు తిరుగుతూ హోటళ్లలో ఉంటూ మద్యం తాగుతూ జిల్సాలు చేయసాగాడు. తాను ఏక్షణమైనా పోలీసులకు దొరుకుతానని ముందే గ్రహించిన అజిత్ కుమార్ చోరీ సొత్తును జల్సాలకే ఖర్చు చేయసాగాడు. కాగా చోరీ అనంతరం నిందితుడి కోసం 3 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన పోలీసులు చివరికి శంషాబాద్ వద్ద మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు రోజుకో ఊరు మారుస్తూ దాదావు 6 సెల్ ఫోన్లు కొని, వాటి ద్వారా అనంతపూర్ లో ఉండే తన సోదరికి ఫోన్ చేశాడు. సోదరి ఫోన్ మీద నిమా పెట్టిన పోలీసులు చివరికి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జల్సాలకు ఖర్చు వేయగా మిగిలిన చోరీ నగదులో 34.90 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో గచ్చిబౌలి ఇన్స్ పెక్టర్ బాలరాజు, డిఐ సరేష్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మంపై దాడి జరిగితే.. ముక్త కంఠంతో ఖండించాలి



జరిగిన తప్పుకు గత టీటీడీ పాలక మండలిదే బాధ్యతనీ, అలాంటి వారిని వెనకేసుకొస్తున్న గత ప్రభుత్వంలోని ముఖ్యమైన వ్యక్తి కూడా బాధ్యత వహించాలన్నారు. హిందూ ధర్మం మీద దాడి జరిగినప్పుడు భాష, కులాలు, ప్రాంతాలకు అతీతంగా ముక్తకంఠంతో ఖండించకపోతే ఇలాంటి పరంపరలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. మంగళవారం శాసన సభలో తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై జరిగిన చర్చలో ప్రసంగించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ “గత ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూ తయారీకి 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి వాడారని సిట్ విచారణలో తేలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ఎన్డీఏ శాసన సభ్యుల సమావేశంలో ముఖ్యమంత్రి గత ప్రభుత్వ అరాచకాలను వివరిస్తున్న క్రమంలో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు నివేదిక కూడా చదివాను. అప్పటికే పలు సందర్భాల్లో భక్తులు లడ్డూలో నాణ్యత లేదని చెప్పారు. సున్నితమైన వ్యవహారంలో రాజకీయ ఆరోపణలు చేయకూడదని అనుకున్నాం. వారి పాలనలో దేవాలయాలపై దాడులు జరిగినా దోషుల్ని పట్టుకోవాలని చెప్పాం. అయితే గత పాలకులు అస్సలు నెయ్యిలో కల్తీయే జరగలేదని చెబుతుంటే ఆ వ్యవహారంపై వివరణ ఇవ్వాలనిపించింది. గతంలో తిరుమల వెళ్లిన సందర్భంలోనూ చాలా మంది ప్రసాదం నాణ్యత అంశాన్ని నా దృష్టికి తీసుకువచ్చారు. తప్పు జరిగిందని తెలిసి దాన్ని సరిగా ముందుకు తీసుకువెళ్లకపోతే ఎలా అన్న పశ్చాత్తాపంతో దీక్ష చేశాను. ఎన్.డి.డి.బి. నివేదిక నెయ్యిలో జంతువుల కొవ్వులు కలిశాయని చెబితే అదే అంశాన్ని ట్వీట్ చేశాను. అప్పుడే దేవాలయాల పరిరక్షణకు సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేస్తే బాగుంటుందనిపించింది. మొన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ఆ నెయ్యిలో అస్సలు నెయ్యే లేదని చెప్పారు.

* జరిగిన తప్పుకి గత పాలక మండలే జవాబుదారీ

సభ సాక్షిగా చెబుతున్నా ఈ వ్యవహారంలో గత ప్రభుత్వం తాలూకు వ్యక్తులు చేశారని ఎక్కడా చెప్పలేదు. ఈ తప్పుకి గత టీటీడీ పాలక మండలిదే బాధ్యత. గత ప్రభుత్వం నియమించిన పాలక మండలి చేసిన తప్పుకి వారే జవాబుదారీ అని చెప్పాను. ఈ వ్యవహారంపై ఎవరైనా నిష్పక్షపాతంగా కమిటీ వేసి బాధ్యులను శిక్షించాలని చెప్పాలి. కానీ వారు ఎందుకు వెనకేసుకొస్తున్నారో అర్ధం కావడం లేదు. తిరుపతి లడ్డూ గురించి ఇంత సభా సమయాన్ని ఎందుకు వృథా చేయాలి. కల్తీ జరిగింది. చర్యలు తీసుకోండి అంటే తప్పు చేసిన వారికి శిక్ష పడుతుంది. అస్సలు కల్తీయే జరగలేదు. జంతువుల కొవ్వు లేదు అని మాట్లాడడమే ఇంత చర్చకు దారితీసింది. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడారన్న కేసు దర్యాప్తు చేసిన సీబీఐ నేతృత్వంలోని సిట్ ఆ నెయ్యి తయారీకి ఒక్క లీటరు పాలు కూడా వినియోగించలేదని తేల్చింది. పామాయిల్లో రసాయనాలు కలిపి తయారు చేసినట్టు చెప్పింది. ఆ ఇతర రసాయనాలు ఏ మూలకాల నుంచి తయారయ్యాయో నిర్ధారించే సాంకేతికత తమా వద్ద లేదని ఛార్జ్ షీట్ లో పేర్కొంది. ఈ కేసులో 36 మందిని నిందితులుగా తేల్చింది. శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు ఒక ప్రణాళికాబద్ధంగా కుట్ర జరిగినట్టు సిట్ చెప్పింది. తమకి నచ్చిన సంస్థలకు నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు ఓ ప్రణాళిక ప్రకారం టెండర్ నిబంధనలు సవరించారు. నెయ్యి సరఫరా సంస్థకి ఉండాల్సిన కనీస వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ. 150 కోట్లకి తగ్గించారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలను సేకరించాలన్న నిబంధనను తొలగించారు. డెయిరీ రంగంలో మూడేళ్ల అనుభవం ఉండాలన్న నియమాన్ని ఏడాదికి కుదించారు. రోజుకి 12 టన్నుల వెన్న తయారు చేయాలన్న నిబంధనను 8 టన్నులుగా మార్చేశారు.

* 11 కోట్ల మందికి కల్తీ నెయ్యి లడ్డూలు పంపిణీ


సవరణ అనంతరం వాళ్ళు ఎంపిక చేసిన సంస్థలు 20202023 మధ్య నెయ్యి సరఫరా చేశాయి. నెయ్యి సరఫరా చేసిన సంస్థకి అందుకు కావాల్సిన కనీస అర్హతలు లేవని సిట్ ఛార్జ్ షీట్ చెప్పింది. వీరు నెయ్యి సరఫరాకి ఎంచుకున్న భోలే బాబా అనుబంధ సంస్థలు మాల్ గంగా, వైష్ణవి డెయిరీలు ఒక్క లీటరు నెయ్యిని కూడా పాల నుంచి తయారు చేయలేదు. 20192024 మధ్య కాలంలో సుమారు 11 కోట్ల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటే, ఆ కాలంలో మొత్తం 48.76 కోట్ల లడ్డూ ప్రసాదాల విక్రయం జరిగింది. అందులో సుమారు 20.10 కోట్ల లడ్డూలు నకిలీ నెయ్యితో తయారయ్యాయని టీటీడీ రికార్డులు చెబుతున్నాయి. ఆ 11 కోట్ల మందికి రసాయనాలతో నిండిన ప్రసాదాన్ని విక్రయించారు. ఇందులో నుంచే లక్ష లడ్డూలు ఆయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా పంపిణీ చేశారు. మళ్లీ ఆ లడ్డూలు కల్తీ నెయ్యితో చేసినవి కాదు అంటారు. సిట్ రిపోర్టు నెయ్యిలో రసాయనాలు ఉన్నాయని చెప్పింది. ఆ రసాయనాల్లో ఏముందో పెరుమాళ్లకెరుక. హిందూ ధర్మానికి కాకుండా ఇంకా ఏ ధర్మానికి ఇలాంటిది జరిగినా దేశం మొత్తం గగ్గోలు పెట్టేసేవారు. మన దేశంలో ప్రతి హిందువు దర్గాకి వెళ్తారు. సకల ధర్మాలను గౌరవించడం మన దేశం తాలూకు మూల సంస్కృతి. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామికి పెట్టిన ప్రసాదాన్ని అపవిత్రం చేసి తప్పు లేదని మాట్లాడుతున్నారు. ఇలాగే ఇస్లాం, క్రిస్టియానిటీల్లో జరిగితే పరిస్థితులు ఇలా ఉండేవి కావు. ఇతర మతాల గురించి మాట్లాడితే ఓట్లు పోతాయి. హిందువుల గురించి మాట్లాడడం తేలిక అన్న పద్ధతిలో మార్పు రావాలి. రాజు కోసం వసూళ్లు చేసే వారు భగవంతుడి సేవలో ఉండరాదు కల్తీ నెయ్యి వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నప్పుడు తప్పు చేశామన్న అపరాధ భావన వాళ్ళకు కలిగి తీరుతుంది. ఇన్ని తప్పులు చేసిన వారిని వెనకేసుకుని వచ్చే వారికి ఆ పాపం చుట్టుకుని తీరుతుంది. శ్రీకృష్ణ దేవరాయలు వారు రచించిన అముక్తమాల్యదలోని 218వ పద్యంలో రాజుకి కర్తవ్యాన్ని ఉపదేశిస్తూ ఓ పద్యం ఉంది. భగవంతుడి సేవలో ఎలాంటి వారిని నియమించాలో రాజుకి కర్తవ్యాన్ని ఉపదేశించే పద్యం అది. ఆయతికానికి ఇవ్వకు మమరాలయ ముఖ్యము, అతడు అర్థ తృష్ణాయుతుడై నిజోర్వి అగు నష్టికి ఆ ధనమును తరల్చి, రాజు ఆయతనమునకు చేర్చు, మరి అట్టిది అపథ్యము, కాన, వొంటిగాడే అధికారి కావలయు, ఇంచుక తిన్నను వాడె రూపరున్ రాజు కోసం వసూళ్లు చేసే వారికి దేవాలయాలపై అధికారం ఇవ్వొద్దు. అలాంటి వారు డబ్బు మీద ఆశతో రాజ్యానికి సంబంధించిన వసూళ్లలో నష్టం వచ్చినప్పుడల్లా దేవుడి ధనాన్ని రాజు ఖజానాకి చేర్చేస్తాడు. అది తప్పుడు పని కాబట్టి ఎలాంటి మమకారాలు లేని ఒంటరివాడే ఆలయానికి అధికారిగా ఉండాలి. ఒకవేళ వారు దేవుడు సొత్తు తిన్నప్పటికి ఆ పాపానికి వాడే నాశనం అవుతాడు. ఆ డబ్బు తెచ్చి రాజుకి చేర్చడం వల్ల రాజ్యమే నాశనం అవుతుందని ఆ పద్యం చెబుతుంది. గత ప్రభుత్వ పాలనలో అంతా ఇలాగే జరిగింది. తిరుమలలో వారి కర్మలను భక్తులు డబ్బు రూపంలో వేస్తారు. అలాంటి భగవంతుడి డబ్బుని దోచుకునే వారి తరాలే లేచిపోతాయి. వాళ్ళు ఈ కేసుని సాగదీసే కొద్దీ వాళ్ళ పాపం పెరుగుతుంది” అన్నారు.



# గేమింగ్ లవర్స్ కోసం ఐకూ కొత్త ఫోన్.. ఊహించని ధరకు 15R

గేమింగ్ లవర్స్ ఎక్కువగా ఇష్టపడే ఐకూ బ్రాండ్ నుంచి మరో కొత్త స్మార్ట్‌ఫోన్ లాంచ్ అయ్యింది. ఐకూ 15 సిరీస్‌లో ఐకూ 15Rను (iQOO 15R) దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. స్నాప్‌డ్రాగన్ 8 జన్ 5 ప్రాసెసర్, 7,600 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీతో ఈ ఫోన్‌ను తీసుకురావడం గమనార్హం. ఫ్లాగ్‌షిప్ ఫీచర్లతో తీసుకొచ్చిన ఈ ఫోన్ ధర, ఇతర వివరాలు ఇప్పుడు చూద్దాం.. iQOO 15R specifications: ఐకూ 15ఆర్ ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆరిజిన్ ఓఎస్ 6తో పనిచేస్తుంది. దీనికి నాలుగేళ్లు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. 6.59 అంగుళాల 1.5K అమోలెడ్ డిస్‌ప్లే, 120Hz రిఫ్రెష్ రేటుతో వస్తోంది. 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. హెచ్‌డీఆర్ 10 సర్టిఫికేషన్, గేమింగ్ సమయంలో 144 Hz రిఫ్రెష్ రేటుతో ఈ ఫోన్ పనిచేస్తుంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ జన్ ఎస్5 ప్రాసెసర్ అమర్చారు. వెనుకవైపు 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ 700వీ ప్రధాన కెమెరా ఇచ్చారు. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఉంది. ముందు వైపు 32 ఎంపీ కెమెరా ఇచ్చారు. వైఫై 7, బ్లూటూత్ 6, టైప్‌సీ పోర్ట్, ఐపీ68, ఐపీ 69 రేటింగ్‌తో వస్తోంది. ఇందులో 7,600 ఎంఏహెచ్ బ్యాటరీ 100W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. iQOO 15R price: ధర విషయానికొస్తే.. ఐకూ 15ఆర్ మూడు స్టోరేజీ వేరియంట్లలో లభ్యమవుతుంది. దీని ధర రూ.50 వేల పైనే ఉంటుందని ఊహించినప్పటికీ.. అంతకంటే తక్కువ ధరకే తీసుకురావడం గమనార్హం. 8జీబీ+ 256జీబీ వేరియంట్ ధర రూ.44,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీ+ 256జీబీ వేరియంట్ రూ.47,999, 12జీబీ+ 512జీబీ వేరియంట్ రూ.52,999గా నిర్ణయించారు. డార్క్ నైట్, ట్రయంఫ్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. అమెజాన్, ఐకూ ఇండియా, వివో రిటైల్ స్టోర్లలో నేటి నుంచి బుకింగ్స్ స్వీకరిస్తున్నారు. మార్చి 3 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్/డెబిట్ కార్డు కొనుగోళ్లపై రూ.4వేలు డిస్కౌంట్ పొందొచ్చు. రూ.1899 విలువ చేసే ఐకూ/వివో టీడబ్ల్యూఎస్‌ను ఉచితంగా అందిస్తున్నారు.

## రూ.20 వేలకోట్ల పెట్టుబడి ఎయిర్‌టెల్ ప్లాన్ ఏంటి?




మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ బ్యాంకింగేతర అనుబంధ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ) ఎయిర్‌టెల్ మనీ లిమిటెడ్‌పై భారీ ప్రణాళికలు ప్రకటించింది. రానున్న కొన్నేళ్లలో రూ. 20,000 కోట్ల పెట్టుబడులకు తెరతీయనున్నట్లు పేర్కొంది. వీటిలో 70 శాతం ఎయిర్‌టెల్ సమకూర్చనుండగా.. మిగిలిన 30 శాతం ప్రమోటర్ గ్రూప్ సంస్థ భారతీ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా లభించనున్నట్లు తెలియజేసింది.

ఎయిర్‌టెల్ మనీ ఇటీవలే(2026 ఫిబ్రవరి 13న) ఆర్‌బీఐ నుంచి ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్‌ను పొందింది. పటిష్ట డిజిటల్ ఆస్తులు, 500కుపైగా సైంటిస్టులతో నడుస్తున్న భారీ డేటా ఎనలిటిక్స్, లోతైన నిర్వహణా సామర్థ్యాలు కలిగిన కంపెనీగా ఎయిర్‌టెల్ కొత్తతరహా డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసులను దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు ఒక ప్రకటనలో వివరించింది.

డిజిటల్ ప్లాట్‌ఫామ్, సమీకృత చానళ్ల ద్వారా గత రెండేళ్లుగా క్రెడిట్ ఇంజిన్‌ను నిర్మించినట్లు పేర్కొంది. దీంతో దేశీయంగా పటిష్ట రుణ సర్వీసుల మోడళ్లలో ఒకటిగా ఆవిర్భవించినట్లు తెలియజేసింది. ఇప్పటికే రూ. 9,000 కోట్లకుపైగా రుణాల విడుదల ద్వారా ప్లాట్‌ఫామ్ అత్యున్నతస్థాయి(హైపర్‌స్కేల్)ని అందుకున్నట్లు వెల్లడించింది. ఇందుకు పటిష్ట అండర్‌రైటింగ్ విధానాలు, క్రమశిక్షణాయుత పోర్ట్‌ఫోలియో నిర్వహణ, రియల్‌టైమ్ రిస్క్ పర్యవేక్షణ దోహదపడినట్లు వివరించింది.

# మార్కెట్లపై ట్రంప్ దెబ్బ... కుప్పకూలిన సెన్సెక్స్

**భారీ నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు**
**అమెరికా వాణిజ్య విధానాలపై ఆందోళనలతో అమ్మకాల ఒత్తిడి**
**1068 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 288 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**
**రెండేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన ఐటీ రంగ షేర్లు**
**మార్కెట్లలో మరికొంత కాలం అస్థిరత కొనసాగే అవకాశం**



అమెరికా వాణిజ్య విధానాలపై తాజాగా తలెత్తిన ఆందోళనలతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. గత నాలుగు రోజుల్లో ఎన్నడూ లేనంతగా అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు కుప్పకూలాయి. బ్యాంకింగ్, ఇన్‌ఫ్రా, ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో సెన్సెక్స్ 1,068.74 పాయింట్లు నష్టపోయి 82,225.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 288.35 పాయింట్లు తగ్గి 25,424.65 వద్ద స్థిరపడింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా 15 శాతం తాత్కాలిక టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించడంతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ రాజుకుంటాయన్న భయాలు మొదలయ్యాయి. గతంలో ఆయన విధించిన టారిఫ్‌లు చట్టవిరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడంతో అంతర్జాతీయ మార్కెట్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీని ప్రభావం భారత మార్కెట్లపై కూడా ప్రతికూలంగా పడింది.

ఈ అమ్మకాల ఒత్తిడిలో ఐటీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. అమెరికా టెక్నాలజీ వ్యయంపై ఆందోళనలు, బలహీనమైన గ్లోబల్ సంకేతాలతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.74 శాతం పతనమై 30,053.50 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో ఈ సూచీ రెండేళ్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఐటీ తర్వాత రియాల్టీ రంగం 2.54 శాతం నష్టపోయింది. అయితే, మెటల్ ఇండెక్స్ మాత్రం మార్కెట్ పతనంలోనూ కాస్త మెరుగ్గా నిలిచింది.

విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 25,500–25,600 స్థాయి కీలక నిరోధకంగా ఉంది. దీనిపైన నిలదొక్కుకుంటేనే మార్కెట్ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ 25,300 స్థాయికి దిగువకు పడిపోతే, అమ్మకాల ఒత్తిడి మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ఏఐ టెక్నాలజీపై ఆందోళనల కారణంగా మార్కెట్లు సమీప భవిష్యత్తులో అస్థిరంగానే కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# నోయల్ టాటా 4 షరతులు.. చంద్రశేఖరన్ పునర్నియామకం వాయిదా!



టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్ పునర్నియామకం వాయిదా పడింది. మూడోసారి ఛైర్మన్‌గా నియమించే అంశంపై నిర్ణయాన్ని ప్రస్తుతానికి వాయిదా వేయాలని చంద్రశేఖరనే టాటా సన్స్ బోర్డును కోరారు. మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో కొన్ని అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. 2017లో టాటా సన్స్ ఛైర్మన్‌గా నియమితులైన చంద్రశేఖరన్ రెండోసారి ఆ పదవిలో కొనసాగుతున్నారు. 2027 ఫిబ్రవరితో చంద్రశేఖరన్ పదవీకాలం ముగియనుంది.

టాటా సన్స్ బోర్డు సమావేశంలో కొందరు బోర్డు సభ్యులు చంద్రశేఖరన్ పునర్నియామకానికి మద్దతు ప్రకటించారు. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా మాత్రం కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారు. కొత్తగా చేపట్టిన వ్యాపారాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు పునర్నియామకం చేపట్టడానికి కొన్ని షరతులు కూడా విధించినట్లు ఆంగ్లమీడియా కథనాలు పేర్కొన్నాయి. టాటా సన్స్ లిస్ట్ (అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ కింద లిస్ట్ చేయాల్సి ఉంది) చేయకపోవడం, కంపెనీ అప్పుల్లేకుండా చూడడం, రిస్కుతో కూడుకున్న పెట్టుబడులకు దూరంగా ఉండడం, ఎయిరిండియా, బిగ్‌బాస్కెట్ రుణాలను తగ్గించడం వంటివి ఈ జాబితాలో ఉన్నాయి.

అయితే, బోర్డు పునర్నియామక కమిటీ హెడ్ అనితా జార్జ్ మాత్రం చంద్రశేఖరన్‌కు అనుకూలంగా మాట్లాడినట్లు తెలిసింది. గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల్లో నష్టాలు సహజమని, దానికి కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. అయితే, కొందరు సభ్యులు ఓటింగ్ చేపట్టాలని సూచించగా.. చంద్రశేఖరన్ మాత్రం ప్రస్తుతానికి ఈ అంశాన్ని వాయిదా వేయాలని బోర్డు సభ్యులను కోరారు. టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య ఏకాభిప్రాయంతోనే టాటా గ్రూప్ సంస్థలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో పునర్నియామక ప్రక్రియ వాయిదా పడింది.

## బెస్ట్ మైలేజ్ కార్లు .. ధర రూ.10 లక్షల కంటే తక్కువ!



కార్లు కొనుగోలు చేసే చాలామంది ఎక్కువ మైలేజ్ ఇచ్చే వాహనాలను ఎంచుకుంటారు. ఇందులో కూడా కొంత తక్కువ ధరలో లభించే కార్లు అయితే బెస్ట్ అని భావిస్తారు. కాబట్టి ఈ కథనంలో అత్యుత్తమ మైలేజ్ (ఏఆర్ఏఐ) ఇచ్చే రూ. 10 లక్షల (ఎక్స్ షోరూమ్) కంటే తక్కువ ధరలో లభించే 10 కార్ల గురించి తెలుసుకుందాం.

మారుతి సుజుకి సెలెరియో (రూ. 4.69 లక్షల నుంచి రూ. 6.73 లక్షలు): 25-26 కిమీ/లీ పెట్రోల్ & 35 కిమీ/కేజీ సీఎన్‌జీ

మారుతి సుజుకి స్విఫ్ట్ (రూ. 5.79 లక్షల నుంచి రూ. 8.65 లక్షలు): 24.8 కిమీ/లీ పెట్రోల్ & 32.85 కిమీ/కేజీ సీఎన్‌జీ

మారుతి సుజుకి డిజైర్ (రూ. 6.26 లక్షల నుంచి రూ. 8.031 లక్షలు): 24.8 కి.మీ/లీ పెట్రోల్ & 33.73 కి.మీ/కేజీ సీఎన్‌జీ

మారుతి సుజుకి వ్యాగన్ ఆర్ (రూ. 4.99 లక్షల నుంచి రూ. 6.84 లక్షలు): 25.19 కి.మీ/లీ పెట్రోల్ & 33.47 కి.మీ/కేజీ సీఎన్‌జీ

మారుతి సుజుకి ఆల్టో కే10 (రూ. 3.70 లక్షల నుంచి రూ. 5.45 లక్షలు): 24.9 కిమీ/లీ పెట్రోల్ & 33.40 కిమీ/కేజీ సీఎన్‌జీ

మారుతి సుజుకి ఎస్-ప్రెస్సో (రూ. 3.50 లక్షల నుంచి రూ. 5.25 లక్షలు): 25.30 కిమీ/లీ పెట్రోల్ & 32.73 కిమీ/కేజీ సీఎన్‌జీ

మారుతి సుజుకి బాలెనో (రూ. 5.99 లక్షల నుంచి రూ. 9.10 లక్షలు): 22.35 కిమీ/లీ పెట్రోల్ & 30.61 కిమీ/కేజీ సీఎన్‌జీ

టాటా టియాగో (రూ. 4.57 లక్షల నుంచి రూ. 7.82 లక్షలు): రూ. 19 కి.మీ./లీటర్ పెట్రోల్

హ్యుందాయ్ గ్రాండ్ ఐ 10 నియోస్ (రూ. 5.47 లక్షల నుంచి రూ. 7.92 లక్షలు): 16-18 కి.మీ/లీ పెట్రోల్

రెనాల్ట్ క్విడ్ (రూ. 4.30 లక్షల నుంచి రూ. 6.45 లక్షలు): 22 కి.మీ/లీ పెట్రోల్

# ఏఐతో ముందుపోయే ఉద్యోగాలు ఇవే: ఆంథ్రోపిక్ సీఈఓ



కృత్రిమ మేధ అన్ని రంగాల్లోకి శరవేగంగా విస్తరిస్తోంది. ఈ కారణంగా ఇప్పటికే భారీ సంఖ్యలో లేఆఫ్‌లు చూస్తున్నాం. ఏఐతో మొదట పోయే ఉద్యోగాలు (ఏఐతో భర్తీ) ఏంటో తెలుసా..? జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆంథ్రోపిక్ (Anthropic) సీఈఓ డారియో అమోడెయ్ ఈ విషయంపై మాట్లాడారు.

''ఏఐ (Artificial Intelligence) ఆటోమేషన్ కారణంగా ముందుగా భర్తీ అయ్యేది కోడింగ్ ఉద్యోగాలే. సాఫ్ట్‌వేర్ రాయడంలో ఏఐ సిస్టమ్స్ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. ఆర్కిటెక్చర్, ప్రొడక్ట్ సెన్స్, యూజర్ అండర్‌స్టాండింగ్ వంటి ఇంజినీరింగ్ డివిజన్స్ ఆటోమేట్ కావడానికి కొంచెం ఎక్కువ సమయం పడుతుంది. ప్రస్తుతం మనుషులు చేసే ఆ పనులను ఏఐ టేకోవర్ చేస్తుందని నా అభిప్రాయం. అదే సమయంలో మనుషులు ఈ ఏఐ టూల్స్‌కు డైరెక్షన్ ఇవ్వడం.. తదితర ఉన్నతస్థాయి విధులు చేపట్టనున్నారు. ఏఐతో అద్భుతమైన ఔట్‌పుట్ వచ్చినప్పటికీ.. దీనిపై అతిగా ఆధారపడటం వల్ల రీజనింగ్ సామర్థ్యాలు దెబ్బతింటాయి'' అని హెచ్చరించారు. విద్యారంగం విషయంలోనూ ఇదే ఆందోళన నెలకొని ఉంది. విద్యార్థులు తమ థింకింగ్ సామర్థ్యాన్ని ఏఐకి ఔట్‌సోర్స్ చేస్తారనే భయాలు ఉన్నాయి. ఏఐని దుర్వినియోగం చేస్తే.. మూర్ఖత్వమే అవుతుందని డారియో (Dario Amodei) అభిప్రాయపడ్డారు. ఇక, ఈ ఏఐ ప్రపంచంలో క్రిటికల్ థింకింగ్ స్కిల్స్ ఎంతో కీలకంగా మారనున్నాయని యువతకు సలహా ఇచ్చారు. ఆంథ్రోపిక్‌ను స్థాపించడానికి ముందు తానొక బయోలజిస్ట్‌నని వెల్లడించారు.

# అమెరికన్ కంపెనీ భారీ రీకాల్!



ఇటీవల దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీలు తమ వాహనాలకు రీకాల్ జారీ చేస్తున్నాయి. ఈ తరుణంలో అమెరికన్ కార్ల తయారీ సంస్థ ఫోర్డ్ భారీ రీకాల్ ప్రకటించింది. దీని ప్రభావం ఏకంగా 4,12,774 వాహనాల మీద పడింది. ఈ విషయాన్ని యూఎస్ నేషనల్ హైవే ట్రాఫిక్ సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది.

రియర్ సస్పెన్షన్ టో లింక్‌లలో సమస్య ఉండటం వల్లనే కంపెనీ ఈ భారీ రీకాల్ ప్రకటించింది. ప్రభావిత వాహనాలకు పరిష్కారంగా డీలర్లు టో లింక్‌లను ఉచితంగా భర్తీ చేయాలని రెగ్యులేటర్ సూచించింది. అంతే కాకుండా.. బ్యాటరీ వైఫల్యాలు & బ్రేక్ పెడల్స్‌లోని లోపాల కారణంగా ఫోర్డ్ అమెరికాలో మరో 40,655 వాహనాలకు రీకాల్ జారీ చేసింది.

భారత్‌కు ఫోర్డ్ కంపెనీ

అమెరికన్ ఆటోమొబైల్ కంపెనీ ఫోర్డ్.. తమిళనాడులోని చెన్నై ప్లాంట్‌లో తయారీ కార్యకలాపాలను పునఃప్రారంభించడానికి సిద్ధమైంది. దీనికోసం సంస్థ తమిళనాడు ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం (MoU)పై సంతకం చేసింది.

ఫోర్డ్ కంపెనీ మరైమలై నగర్ ప్లాంట్‌లో నెక్స్ట్ జనరేషన్ ఇంజిన్ తయారీకి కొత్త లైన్‌ను ఏర్పాటు చేయనుంది. ఇది నాలుగు సంవత్సరాల విరామం తర్వాత.. భారతదేశంలో ఉత్పత్తికి పునరాగమనాన్ని సూచిస్తుంది. ఒప్పందం ప్రకారం.. ఫోర్డ్ సంస్థ ఈ ప్రాజెక్టు కోసం రూ.3,250 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. కంపెనీ తన కార్యకలాపాలను ప్రారంభించిన తరువాత 600 కంటే ఎక్కువ ప్రత్యక్ష ఉద్యోగాలు, అనేక పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సంస్థకు చెందిన కొత్త సౌకర్యంలో సంవత్సరానికి 2,35,000 ఇంజిన్లను ఉత్పత్తి చేయనుంది. ఈ ఉత్పత్తి 2029లో

## 2026 కేటీఎం 250 డ్యూక్ వచ్చేసింది ధర ఎంతంటే?

కేటీఎం కంపెనీ 250 డ్యూక్ 2026 ఎడిషన్‌ను లాంచ్ చేసింది. స్లేట్ గ్రే, సిల్వర్ మెటాలిక్ అనే రెండు రంగుల్లో లభించే ఈ బైక్ ధర రూ. 2.13 లక్షలు (ఎక్స్ షోరూమ్).

సిల్వర్ మెటాలిక్ వెర్షన్ బైక్.. బూడిద రంగు ఫ్యూయెల్ ట్యాంక్ & సిల్వర్ ట్యాంక్ ఎక్స్‌టెన్షన్‌లు 250 డెకాల్స్ పొందుతుంది. అయితే స్లేట్ గ్రే బైక్ నారింజ రంగు ఫ్యూయెల్ ట్యాంక్ & బూడిద రంగు ట్యాంక్ ఎక్స్‌టెన్షన్‌లతో వస్తుంది. ఈ బైక్ 17 ఇంచెస్ అల్లాయ్ వీల్స్ పొందుతుంది. ఇందులో 320 మిమీ ఫ్రంట్ డిస్క్, 240 మిమీ రియర్ డిస్క్ ఉన్నాయి. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ ఉంది. 2025 డ్యూక్ 2026 మోడల్ ఎలాంటి యాంత్రిక మార్పులకు లోను కాలేదు. కాబట్టి ఇందులో అదే 248.8 సీసీ సింగిల్ సిలిండర్ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ ఉంటుంది. ఇది 9250 rpm వద్ద 30.75 BHP & 7,250 rpm వద్ద 25 Nm టార్క్ అందిస్తుంది. ఇది 6 స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్స్ పొందుతుంది.






## 'ది కేరళ స్టోరీ-2'కు సెన్సార్ సెగ: 16 కోతలు..
# సగానికి పైగా తగ్గిన ముద్దు సీన్లు!


**విడుదలకు ముందే 'ది కేరళ స్టోరీ-2' ప్రకంపనలు**
**డైలాగ్స్, సన్నివేశాల విషయంలో కఠినంగా వ్యవహరించిన సెన్సార్ బోర్డు**
**మత సామరస్యం విషయంలో పొరపాట్లు జరగకూడదన్న సెన్సార్ బోర్డు**

బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా వస్తున్న రెండో భాగం విడుదలకు ముందే వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. చిత్రంలోని సున్నితమైన అంశాలు, హింసాత్మక దృశ్యాలపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్ సీ) ఉక్కుపాదం మోపింది. కేవలం డైలాగులకే పరిమితం కాకుండా, విజువల్స్ విషయంలోనూ బోర్డు అత్యంత కఠినంగా వ్యవహరించడం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఈ చిత్రానికి సంబంధించి సెన్సార్ బోర్డు మొత్తం 16 మార్పులను సూచించింది. వీటిలో ప్రధానంగా అత్యాచారానికి సంబంధించిన ఒక సుదీర్ఘమైన దృశ్యాన్ని పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. సమాజంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, అటువంటి హింసాత్మక విజువల్స్‌కు తావులేదని బోర్డు స్పష్టం చేసింది. ఇక రొమాంటిక్ సీన్ల విషయానికి వస్తే.. ఒరిజినల్ వెర్షన్‌లో ఉన్న ముద్దు సీన్ల నిడివిని ఏకంగా 50 శాతానికి తగ్గించేశారు. శృంగారభరిత దృశ్యాల విషయంలో రాజీ పడకూడదని సెన్సార్ సభ్యులు నిర్ణయించారు.

కేవలం దృశ్యాలే కాకుండా, చిత్రంలోని కొన్ని కీలక సంభాషణలు కూడా మార్పులకు గురయ్యాయి. సమాజంలోని కొన్ని వర్గాలను కించపరిచేలా ఉన్న పదాలను తొలగించి, వాటి స్థానంలో అర్థం మారకుండా ఉండే ప్రత్యామ్నాయ పదాలను చేర్చాలని మేకర్స్‌కు సెన్సార్ బోర్డు సూచించింది. దేశ సార్వభౌమాధికారం, మతపరమైన సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకూడదని సెన్సార్ బోర్డు గట్టిగా నొక్కి చెప్పింది. దీంతో చిత్ర యూనిట్ ఈ మార్పులన్నింటికీ అంగీకరించి 'U/A' సర్టిఫికెట్ పొందినట్లు సమాచారం.

ఈ సినిమా తొలి భాగం కేరళలో జరిగిన మత మార్పిడుల నేపథ్యంలో వచ్చి దేశవ్యాప్తంగా చర్చలకు దారితీసింది. ఇప్పుడు రెండో భాగంలోనూ అటువంటి వివాదాస్పద అంశాలనే టచ్ చేసినట్లు సెన్సార్ కట్‌లను బట్టి అర్థమవుతోంది. అయితే, సెన్సార్ బోర్డు విధించిన ఈ ఆంక్షలు సినిమాను ఏ మేరకు దెబ్బతీస్తాయి? లేక ఈ వివాదాలే సినిమాకు మరింత పబ్లిసిటీ తెచ్చి పెడతాయా? అన్నది వేచి చూడాలి. ఏదేమైనా, సినిమా నిడివి తగ్గినా.. ప్రభావం మాత్రం తగ్గకూడదని దర్శకుడు సుదీప్తో సేన్ బృందం భావిస్తోంది.



## షూటింగ్ సమయంలో జరిగిన ఒక ఘటన..
# అనుపమ జీవితాన్ని మార్చేసింది!

'కార్తికేయ2' సినిమా షూటింగ్ సమయంలో ఘటన
షూటింగ్ స్పాట్‌లో తిరుగుతున్న మేకపిల్లతో ఆనందంగా గడిపిన అనుపమ
ఆ మేకపిల్లతో మధ్యాహ్నం మటన్ బిర్యానీ చేసిన వైనం
విషయం తెలిసి వాంతులు చేసుకున్న అనుపమ



**అప్పటి నుంచి శాకాహారిగా మారిన వైనం**

గ్లామరస్ హీరోయిన్‌గా, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో మెప్పించే అనుపమ పరమేశ్వరన్ అంటే అందరికీ అభిమానమే. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో వరుస చిత్రాలు చేస్తూ ఆమె ఫుల్ బిజీగా ఉన్నారు. మరోవైపు, షూటింగ్ సమయంలో ఆమె జీవితంలో జరిగిన ఒక సంఘటన ఆమెను పూర్తిగా మార్చేసింది. ముఖ్యంగా ఆమె ఆహారపు అలవాట్లను మార్చుకోవడానికి కారణమైన "మటన్ బిర్యానీ" ఉదంతం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని గుర్తు చేసుకుంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**అసలేం జరిగింది?**

'కార్తికేయ2' సినిమా షూటింగ్ గుజరాత్‌లో జరుగుతున్న సమయం అది. షూటింగ్ స్పాట్‌లో ఒక చిన్న మేకపిల్ల తిరుగుతుండేది. జంతువులంటే ఎంతో ప్రేమ ఉన్న అనుపమ, ఆ మేకపిల్లతో షూటింగ్ విరామంలో ఆడుకునేవారు. దానికి ఆహారం పెడుతూ, దానితో గడుపుతూ షూటింగ్ విరామ సమయాలను గడిపేవారు.

ఓ రోజు మధ్యాహ్నం భోజన సమయంలో చిత్ర యూనిట్ అందరికీ మటన్ బిర్యానీ వడ్డించారు. అనుపమ కూడా ఎంతో ఇష్టంగా ఆ బిర్యానీ తింటున్నారు. అదే సమయంలో ఆమె దగ్గరికి వచ్చిన అసిస్టెంట్.. నవ్వుతూ ఒక మాట చెప్పాడు. "మేడం.. మీరు తింటున్నది మీరు పొద్దున ఆడుకున్న ఆ మేకపిల్లనే" అని అన్నాడు. ఆ మాట వినగానే అనుపమ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తింటున్న ముద్ద కూడా గొంతు దిగలేదు. ఆ విషయాన్ని తట్టుకోలేక ఆమెకు వెంటనే వాంతులు అయ్యాయి. తాను ఎంతో ప్రేమగా ఆడుకున్న మూగ జీవాన్ని తన కళ్లముందే చంపి, ఆహారంగా పెట్టారనే విషయాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయారు.

ఈ సంఘటన అనుపమ మనసుపై ఎంతటి ప్రభావం చూపిందంటే... అప్పటి నుండి ఆమె నాన్‌వెజ్ ముట్టడమే మానేశారు. మాంసాహారానికి దూరంగా వుంటున్నారు.

## మీ విజన్‌తో అద్భుతాలు చేస్తారు..
### పెద్ది కెమెరామెన్‌ను పొగడ్తలతో ముంచెత్తిన రామ్ చరణ్

- ''పెద్ది' సినిమా సినిమాటోగ్రాఫర్ రత్నవేలుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పిన చెర్రీ
- ఆయన విజన్‌తో ప్రతి ఫ్రేమ్‌లో మ్యాజిక్ ఉంటుందని ప్రశంస
- 'మెగా పవర్ బ్లాస్ట్' త్వరలో లోడ్ అవుతోందంటూ హింట్ ఇచ్చిన చిత్రబృందం
- బుచ్చిబాబు సానా దర్శకత్వంలో భారీ అంచనాలతో రూపొందుతున్న యాక్షన్ డ్రామా
- ఏప్రిల్ 30న సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటన

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది' సినిమాటోగ్రాఫర్ ఆర్. రత్నవేలుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోని అత్యుత్తమ సినిమాటోగ్రాఫర్లలో ఒకరైన రత్నవేలు పనితనాన్ని కొనియాడుతూ చరణ్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. ఆయన విజన్‌తో ప్రతి ఫ్రేమ్‌లో మ్యాజిక్ ఉంటుందని ప్రశంసించారు.

"పుట్టినరోజు శుభాకాంక్షలు రత్నవేలు గారు. మీతో కలిసి సెట్‌లో పనిచేయడం ఎప్పుడూ ఒక గౌరవమే. మీ విజన్ ప్రతి ఫ్రేమ్‌కు ప్రాణం పోస్తుంది. ఈ ఏడాది మీకు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని రామ్ చరణ్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు.

మరోవైపు 'పెద్ది' చిత్రబృందం కూడా తమ అధికారిక ఖాతా ద్వారా రత్నవేలుకు విషెస్ తెలిపింది. రామ్ చరణ్, రత్నవేలు ఉన్న ఒక లొకేషన్ స్టిల్ పంచుకుంటూ, "నిప్పులు చెరిగే ఫ్రేమ్స్.. త్వరలో ఒక మెగా పవర్ బ్లాస్ట్ లోడ్ అవుతోంది" అని పోస్ట్ చేసి అభిమానుల్లో అంచనాలను మరింత పెంచింది.

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ రూరల్ యాక్షన్ డ్రామాపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. ఈ సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పలసూరి' అనే పాత్రలో నటిస్తున్నట్లు ఫస్ట్ లుక్ ద్వారా వెల్లడించారు.

మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లోని అల్యూమినియం



ఫ్యాక్టరీలో ప్రముఖ స్టంట్ మాస్టర్ శ్యామ్ కౌశల్ నేతృత్వంలో ఒక భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

## మహేశ్, రాజమౌళి ఫైట్..
# ఏఐ వీడియోతో వర్మ షాకింగ్ పోస్ట్



**సినిమా చచ్చిపోయింది.. ఇక ఏఐదే రాజ్యమంటూ క్యాప్షన్**
**భవిష్యత్తులో ఏఐతోనే సినిమా తీయొచ్చనే అర్థంలో కామెంట్**
**ఈ వీడియోకు ఫన్నీ కామెంట్స్ చేస్తున్న అభిమానులు**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ).. ఇప్పుడు సినిమా ప్రపంచాన్ని ఊపేస్తోంది. అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ, అబద్ధాలను కూడా నిజమని నమ్మించేలా సృష్టిస్తోంది. తాజాగా టాలీవుడ్ సెన్సేషన్ రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) షేర్ చేసిన ఒక వీడియో ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. అందులో సూపర్ స్టార్ మహేశ్ బాబు, జక్కన్న రాజమౌళి కొట్టుకుంటున్నారు!

**ఏఐ సృష్టించిన మాయ..**

ఏఐ సృష్టించిన ఈ వీడియోలో.. మహేశ్ బాబు, రాజమౌళి ఒకరి కాలర్ ఒకరు పట్టుకుని, తోసుకుంటూ గొడవ పడుతున్నారు. ఇది చూసిన సామాన్యులు ఒక్క క్షణం నిజంగానే ఇద్దరి మధ్య గొడవ జరిగిందా అని భ్రమపడేలా ఆ వీడియో ఉంది. ఈ వీడియోను షేర్ చేస్తూ.. "సినిమా ఈజ్ డెడ్" అంటూ వర్మ తనదైన శైలిలో క్యాప్షన్ ఇచ్చారు. అంటే, భవిష్యత్తులో షూటింగ్స్ అవసరం లేకుండానే ఏఐతో సినిమాలు తీసేయొచ్చని ఆయన పరోక్షంగా సెటైర్ వేశారు.

**ఫ్యాన్స్ ఫన్నీ కామెంట్స్..**

ఈ వీడియో కింద నెటిజన్ల కామెంట్స్ ఓ రేంజ్‌లో ఉన్నాయి. "మహేశ్ పాస్‌పోర్ట్ ఎక్కడ పెట్టావో చెప్పు అని రాజమౌళిని అడుగుతున్నట్టు ఉన్నాడు" అని ఒకరు, "సినిమా రిలీజ్ డేట్ ఎప్పుడో చెప్పకపోతే కొడతా అంటున్న మహేశ్" అని మరొకరు జోకులు పేల్చుతున్నారు. ఈ వైరల్ వీడియో సంగతి పక్కన పెడితే.. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్స్ ఇందులో భాగస్వాములు కావడం విశేషం. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లను షేక్ చేయనుంది.

## జీ 5లో సముద్రఖని క్రైమ్ థ్రిల్లర్!



సీరియల్ కిల్లర్ .. అతణ్ణి పట్టుకోవడానికి పోలీస్ ఆఫీసర్స్ చేసే ప్రయత్నాలతో చాలా సిరీస్ లు ఇంతకుముందు ప్రేక్షకుల ముందుకు వచ్చి ఉంటాయి. అలాగే ఇప్పుడు మరో క్రైమ్ థ్రిల్లర్ ఆడియన్స్ ముందుకు రావడానికి రెడీ అవుతోంది. సముద్రఖని ప్రధానమైన పాత్రను పోషించిన ఆ సిరీస్ పేరే 'తడయం'. నవీన్ కుమార్ పళనివేల్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్, ఈ నెల 27వ తేదీ నుంచి 'జీ 5' ద్వారా పలకరించనుంది. తమిళంలో రూపొందిన సిరీస్ ఇది. ఈ సిరీస్ లో సముద్రఖని పోలీస్ ఆఫీసర్ గా కనిపించనున్నాడు. సముద్రఖని తన కెరియర్లో చాలా పవర్ఫుల్ పాత్రలను పోషించాడు. వాటిలో ఆయనకి పేరు తెచ్చిపెట్టిన పోలీస్ పాత్రలు కూడా ఉన్నాయి. అందువలన ఈ సిరీస్ ను చూడటానికి చాలామంది ఆసక్తిని కనబరుస్తున్నారు. తమిళంతో పాటు వివిధ భాషల్లో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. కథాపరంగా చూసుకుంటే, 1999లో జరిగే కథ ఇది. తమిళనాడు - ఆంధ్ర సరిహద్దుల్లో వరుస హత్యలు జరుగుతూ ఉంటాయి. హంతకుడు వివాహమైన స్త్రీలను లక్ష్యంగా చేసుకుంటూ ఉంటాడు. హత్య చేసిన అనంతరం వాళ్ల మెడలోని 'తాళి'ని దొంగిలిస్తూ ఉంటాడు. హంతకుడు ఎవరు? ఎందుకోసం హత్యలు చేస్తున్నాడు? అనేది మిగతా కథ. యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సిరీస్ ఎలా ఉంటుందనేది చూడాలి మరి.

# మొదలైన విజయ్‌రష్మిక పెళ్లి సందడి..

**టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ వేడుకలు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 26న పెళ్లి పీటలెక్కనున్న ఈ జంట, తమ ప్రీ-వెడ్డింగ్ వేడుకలను స్నేహితులు, కుటుంబ సభ్యుల మధ్య మొదలుపెట్టింది. సోమవారం రాత్రి అత్యంత సన్నిహితుల కోసం పూల్ పార్టీ, క్యాండిల్‌లైట్ డిన్నర్ ఏర్పాటు చేశారు.**

ఉదయ్‌పూర్‌లోని ఆరావళి పర్వత శ్రేణుల్లో ఉన్న విలాసవంతమైన ఐటీసీ మెమెంటోస్ హోటల్ ఈ వేడుకలకు వేదికైంది. తొలి రోజు వేడుకల్లో భాగంగా స్నేహితులతో కలిసి పూల్ వాలీబాల్ ఆడుతూ విజయ్, రష్మిక సందడి చేశారు. అనంతరం జపనీస్ థీమ్‌తో ప్రత్యేకంగా అలంకరించిన ప్రదేశంలో క్యాండిల్‌లైట్ డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ ఫొటోలను రష్మిక సోషల్ మీడియాలో పంచుకున్నారు. నాప్‌కిన్లపై కూడా అభిమానులు ముద్దుగా పిలుచుకునే 'విరోష్' అని ఎంబ్రాయిడరీ చేయడం విశేషం. ఫిబ్రవరి 22న ఈ జంట తమ వివాహాన్ని అధికారికంగా ప్రకటించింది. అభిమానులు తమకు పెట్టిన 'విరోష్' పేరునే తమ పెళ్లికి పెట్టుకుంటున్నట్లు ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. ఈ రోజు (ఫిబ్రవరి 24) మెహందీ, రేపు (ఫిబ్రవరి 25) హల్దీ, సంగీత్ కార్యక్రమాలు జరగనున్నాయి. 26న జరిగే వివాహానికి కేవలం 50 మంది సన్నిహితులు మాత్రమే హాజరుకానున్నారు. అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో సినీ ప్రముఖులు, స్నేహితుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు.



## హైదరాబాద్‌లో అశ్వత్థామ సందడి

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు నాగ్ అశ్విన్ కలయికలో వచ్చిన 'కల్కి 2898ఏడీ' పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఇప్పడీ సినిమాకి కొనసాగింపుగా రెండో భాగం చిత్రీకరణ మొదలైంది. ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని శంకర్‌పల్లిలో సిద్ధం చేసిన ప్రత్యేక సెట్‌లో అమితాబ్ బచ్చన్‌పై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. ఈనెలాఖరు నుంచి కొద్దిరోజుల పాటు ప్రభాస్ కూడా ఈ చిత్రీకరణలో పాలుపంచుకోనున్నట్లు సమాచారం. కమల్‌హాసన్ మార్చి తర్వాత సెట్‌లోకి వచ్చే అవకాశమున్నట్లు తెలిసింది. ప్రభాస్ ఇందులో కర్ణగా.. భైరవగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. అశ్వత్థామగా అమితాబ్, సుప్రీం యాస్కిన్‌గా కమల్ నటిస్తున్నారు. ఇక తొలి భాగంలో దీపిక పదుకొణె చేసిన సుమతి పాత్రను ఈ రెండో భాగంలో ఎవరు పోషిస్తారన్నది తేలాల్సి ఉంది. వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతమందిస్తున్నారు.

# ఐశ్వర్య అర్జున్ కి మిగిలింది చేదు అనుభవమే!

తెలుగు తెరకి వారసులుగా హీరోలు పరిచయం కావడం సాధారణమైన విషయమే. అయితే సీనియర్ హీరోల కూతుళ్లు హీరోయిన్స్ గా ఎంట్రీ ఇవ్వడమనేది ఈ మధ్యనే కాస్త ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే అర్జున్ కూతురు ఐశ్వర్య హీరోయిన్ గా టాలీవుడ్ లో అడుగుపెట్టింది. ఇక్కడ తన తొలి సినిమాగా 'సీతా పయనం' చేసింది. అర్జున్ ఈ సినిమాకి నిర్మాతగా .. దర్శకుడిగా వ్యవహరించడం విశేషం. అయితే ఈ సినిమా ఫలితం నిరాశపరిచిన విషయం తెలిసిందే. నిజానికి అర్జున్ కూతురు కోలీవుడ్ లో హీరోయిన్ గా అడుగుపెట్టి చాలాకాలమే అయింది. అప్పట్లోనే ఆమె తెలుగులో కూడా చేసి ఉండవలసింది. అయితే ఆమె టాలీవుడ్ వైపుకు రావడంలో చాలా ఆలస్యం చేసింది. నిజానికి ఈ సినిమా కోసం అర్జున్ టాలీవుడ్ లో చాలా వరకూ చుట్టబెట్టారు.



ఎంతోమందిని కలుసుకున్నారు. ప్రమోషన్స్ వైపు నుంచి ఈ సినిమాను ఆడియన్స్ కి చేరువగా తీసుకుని వెళ్లడానికి చాలా ప్రయత్నాలు చేశారు. అయితే అవేవీ ఆశించిన ప్రయోజనాన్ని మాత్రం ఇవ్వలేకపోయాయి. ఈ సినిమా విషయంలో రెండు రకాల అభిప్రాయాలు వినిపించాయి. అర్జున్ తన కూతురు సినిమాను తాను డైరెక్ట్ చేయకుండగా ఉండవలసిందనీ, నిర్మాతగా ఆయనే ఉండటం మంచిదైందని చెప్పుకున్నారు. ఎందుకంటే ఆర్థికపరమైన విషయాల వైపు నుంచి ఆయనకి విమర్శలు లేకుండా పోయాయి. కథలో అనవసరమైన విషయాల సంఖ్య పెరగడం, హీరోయిన్ తో పాటు హీరో కూడా కనెక్ట్ కాకపోవడం మైనస్ అయింది. మొత్తానికి ఈ సినిమా ఐశ్వర్య అర్జున్ కి చేదు అనుభవాన్నే మిగిల్చిందని చెప్పాలి.

## మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా లేకపోతే.. మైదానంలోకి అడుగుపెట్టొద్దు: అశ్విన్



దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఘోర పరాజయం
వ్యూహరచనలో టీమిండియా పూర్తిగా విఫలమయిందన్న అశ్విన్
అక్షర్ పటేల్‌ను ఆడించకపోవడంపై అసంతృప్తి

దక్షిణాఫ్రికా చేతిలో భారత జట్టు పరాజయం పాలైన నేపథ్యంలో, టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ జట్టు యాజమాన్యంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. మ్యాచ్ ఆడేందుకు సరైన సన్నద్ధత లేకపోతే మైదానంలోకి అడుగుపెట్టకపోవడమే మంచిదని వ్యాఖ్యానించాడు. తన యూట్యూబ్ ఛానల్ వేదికగా ఈ ఓటమిని విశ్లేషించిన అశ్విన్, భారత జట్టు వ్యూహరచనలో పూర్తిగా విఫలమైందని, ఈ పరాజయం ఒక పెద్ద గుణపాఠం కావాలని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా తుది జట్టులో అక్షర్ పటేల్‌ను తీసుకోకపోవడంపై అశ్విన్ తీవ్రంగా స్పందించాడు. "ఐసీసీ ఈవెంట్లలో జట్లను మాటిమాటికీ మార్చకుండా స్థిరంగా ఉంచాలి. ప్రత్యర్థి జట్టులో లెఫ్ట్ హ్యాండర్ల కోసం వాషింగ్టన్ సుందర్‌ను తీసుకున్న నిర్ణయాన్ని నేను గౌరవిస్తాను. కానీ, టీ20ల్లో అక్షర్ పటేల్ అత్యంత విలువైన ఆటగాడు. గతంలో అతడు సాధించిన విజయాలను అంత త్వరగా ఎలా మర్చిపోతారు?" అని ప్రశ్నించాడు. ఆటగాళ్ల సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేయడం జట్టుకు నష్టమని సూచించాడు.

మరోవైపు, విధ్వంసకర బ్యాటర్ రింకు సింగ్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో 8వ స్థానానికి పరిమితం చేయడాన్ని కూడా అశ్విన్ తప్పుబట్టాడు. జట్టులో ఎనిమిది మంది బ్యాటర్లు ఉన్నప్పటికీ, రింకు వంటి ప్లేయర్‌ను అంత వెనుకకు పంపడం సరైన వ్యూహం కాదన్నాడు. మొత్తం మీద జట్టు కూర్పు, బ్యాటింగ్ క్రమంపై అశ్విన్ చేసిన ఈ విశ్లేషణ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## వరల్డ్ కప్ మధ్యలో జట్టును వీడి ఇంటికి వెళ్లిపోయిన రింకూ సింగ్



కుటుంబంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితితో జట్టును వీడిన రింకూ సింగ్
తండ్రికి కేన్సర్.. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారని సమాచారం
జింబాబ్వేతో జరగనున్న కీలక మ్యాచ్‌కు రింకూ దూరం
రింకూ స్థానంలో తుది జట్టులోకి సంజూ శాంసన్‌కు అవకాశం
దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌కు దూరమైన అక్షర్ పటేల్ మళ్లీ జట్టులోకి వచ్చే ఛాన్స్

టీ20 ప్రపంచకప్‌లో కీలకమైన సూపర్ 8 దశలో ఉన్న టీమిండియాకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. భారత జట్టు స్టార్ ఫినిషర్, ఆల్‌రౌండర్ రింకూ సింగ్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఆరోగ్య అత్యవసర పరిస్థితి కారణంగా జట్టును వీడాడు. జింబాబ్వేతో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌కు ముందు రింకూ హుటాహుటిన ఉత్తరప్రదేశ్‌లోని తన స్వస్థలానికి పయనమయ్యాడు.

కొంతకాలంగా లివర్ కేన్సర్‌తో బాధపడుతున్న రింకూ సింగ్ తండ్రి ఆరోగ్యం విషమించడంతో ఆయన్ను ఆసుపత్రిలో చేర్పించారు. లివర్ కేన్సర్ 4వ దశకు చేరుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే మంగళవారం చెన్నైలో జరిగిన జట్టు ప్రాక్టీస్ సెషన్‌కు రింకూ హాజరుకాలేదు. జింబాబ్వేతో జరగబోయే మ్యాచ్‌లో అతడు ఆడే అవకాశాలు దాదాపుగా లేనట్లేనని తెలుస్తోంది.

సూపర్ 8 తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 76 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌లలో తప్పక గెలవాల్సిన ఒత్తిడిలో ఉంది. ఇలాంటి కీలక సమయంలో డెత్ ఓవర్లలో బ్యాటింగ్‌కు దిగి జట్టుకు అండగా నిలిచే ఫినిషర్ రింకూ దూరం కావడం జట్టు సమతుల్యతపై ప్రభావం చూపనుంది. రింకూ మంచి ఫీల్డర్ కూడా కావడంతో జట్టుకు ఇది పెద్ద లోటుగా మారింది.

రింకూ సింగ్ స్థానంలో తుది జట్టులోకి వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌ను తీసుకునే అవకాశాలున్నాయి. దీంతో పాటు, దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో అనూహ్యంగా పక్కనపెట్టిన స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను జింబాబ్వేతో పోరు కోసం మళ్లీ జట్టులోకి తీసుకురావచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## తేలిపోయిన బ్యాటర్లు..
# ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమి

**ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల జట్టు ఓటమితో ఆరంభించింది. ఈ సిరీస్‌లో భాగంగా మంగళవారం బ్రిస్బేన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 6 వికెట్ల తేడాతో భారత్ పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హర్మన్ సేన 48.3 ఓవర్లలో 214 పరుగులకే ఆలౌటైంది.**



బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురు దెబ్బలు తగిలాయి. స్టార్ బ్యాటర్లు ప్రతిక రావల్ (0), షెఫాలీ వర్మ(4) వరుస బంతుల్లో పెవిలియన్‌కు చేరారు. అయితే స్మృతి మంధాన (58), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (53) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీలతో జట్టును ఆదుకున్నారు.

ఆ తర్వాత భారత్ మళ్లీ వరుస క్రమంలో వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆఖర్లో కశ్వీ గౌతమ్ (43) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ 200 పరుగుల మార్కును దాటగలిగింది. ఆస్ట్రేలియా బౌలర్లలో యాష్ గార్డనర్ 3 వికెట్లతో రాణించగా.. మేఘన్ షాట్, అలానా కింగ్, మెక్‌గ్రాత్ తలా వికెట్ సాధించారు. 215 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా.. 38.2 ఓవర్లలో కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేధించింది. ఓపెనర్లు అలిస్సా హీలీ (50), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (32) అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. అనంతరం బెత్ మూనీ (76 నాటౌట్) అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టును గెలుపు తీరాలకు చేర్చింది. భారత బౌలర్లలో శ్రీ చరణి రెండు వికెట్లు, దీప్తి శర్మ, క్రాంతి గౌడ్ తలా వికెట్ సాధించారు.

## 2026 షెడ్యూల్ విడుదల...
# జూన్ 14న భారత్.. పాకిస్థాన్ ఢీ..



**ఇంగ్లండ్ వేదికగా జూన్ 12 నుంచి జులై 5 వరకు టోర్నీ**
**జూన్ 14న పాకిస్థాన్‌తో తన తొలి మ్యాచ్ ఆడనున్న భారత జట్టు**
**గ్రూప్-ఏలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్‌లతో పాటు భారత్**
**ఇప్పటివరకు ఒక్కసారి కూడా టీ20 టైటిల్ గెలవని టీమిండియా**

క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 పూర్తి షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మంగళవారం విడుదల చేసింది. ఇంగ్లండ్ వేదికగా జరగనున్న ఈ మెగా టోర్నీ జూన్ 12న ఆతిథ్య ఇంగ్లండ్, శ్రీలంక జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. క్రికెట్ మక్కాగా భావించే ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో జులై 5న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నీలో భాగంగా భారత జట్టు తన తొలి మ్యాచ్‌ను చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జూన్ 14న ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఆడనుంది.

ఇటీవల నేపాల్‌లో ముగిసిన క్వాలిఫయర్ టోర్నీ ద్వారా బంగ్లాదేశ్, ఐర్లాండ్, స్కాట్లాండ్, నెదర్లాండ్స్ జట్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించాయి. దీంతో టోర్నీలో పాల్గొనే 12 జట్ల లైనప్ ఖరారైంది. ఈ టోర్నీలో మొత్తం 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్2లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. భారత జట్టును ఆరు సార్లు ఛాంపియన్ ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌తో కూడిన కఠినమైన గ్రూప్‌ఏలో చేర్చారు. ఇక గ్రూప్‌బిలో వెస్టిండీస్, ఇంగ్లండ్, డిఫెండింగ్ ఛాంపియన్ న్యూజిలాండ్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్ జట్లు ఉన్నాయి.

**భారత జట్టు తమ గ్రూప్ దశ మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా ఉంది:**

**జూన్ 14: పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్**
**జూన్ 16: నెదర్లాండ్స్‌తో రెండో మ్యాచ్**
**జూన్ 21: దక్షిణాఫ్రికాతో మూడో మ్యాచ్**
**జూన్ 25: బంగ్లాదేశ్‌తో నాలుగో మ్యాచ్**
**జూన్ 28: ఆస్ట్రేలియాతో చివరి గ్రూప్ మ్యాచ్**

షెడ్యూల్ విడుదల సందర్భంగా ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా మాట్లాడుతూ, "మహిళల టీ20 ప్రపంచకప్ 2026 షెడ్యూల్ విడుదల చేయడం ఈ మెగా ఈవెంట్ సన్నాహాల్లో ఒక ముఖ్యమైన మైలురాయి. మహిళల క్రికెట్‌లో ఐసీసీ నిరంతర పెట్టుబడులకు ఇది కొనసాగింపు. ప్రపంచవ్యాప్తంగా అభిమానుల నుంచి మరింత ఆదరణ, గుర్తింపు పొందడమే మా లక్ష్యం. గతంలో భారత్‌లో జరిగిన మహిళల ప్రపంచకప్ ఈ క్రీడకు కొత్త ఊపునిచ్చింది. ఆ జోరును ఈ టోర్నీతో కూడా కొనసాగించాలని ఆశిస్తున్నాం" అని తెలిపారు.

ఇప్పటివరకు జరిగిన తొమ్మిది ఎడిషన్లలో భారత మహిళల జట్టు ఒక్కసారి కూడా టీ20 ప్రపంచకప్ గెలవలేకపోయింది. నాలుగు సార్లు సెమీఫైనల్స్‌కు చేరినప్పటికీ, 2020లో ఫైనల్‌లో ఓటమిపాలైంది. ఈసారి ఎలాగైనా టైటిల్ గెలిచి తమ దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలని భారత జట్టు పట్టుదలగా ఉంది.

## లక్నో సూపర్ జెయింట్స్ కొత్త లోగో అదుర్స్... ప్రత్యేకతలు చూశారా!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు ముందు లక్నో సూపర్ జెయింట్స్ తమ జట్టుకు సరికొత్త రూపాన్ని ఇచ్చింది. మంగళవారం తమ కొత్త లోగోను ఫ్రాంచైజీ ఆవిష్కరించింది. ఇప్పటివరకు నీలం రంగులో కనిపించిన లక్నో జట్టు, ఇకపై ముదురు ఎరుపు రంగులో దర్శనమివ్వనుంది. ఈ కొత్త లోగోలో గరుడ, కిరీటం, ఏనుగు చిహ్నాలను చేర్చారు.

ఈ కొత్త లోగో డిజైన్, సంజీవ్ గోయెంకా గ్రూప్‌కు చెందిన మరో ఫుట్‌బాల్ జట్టు 'మాంచెస్టర్ సూపర్ జెయింట్స్' లోగోను పోలి ఉండటం గమనార్హం. మాంచెస్టర్ జట్టు లోగోలో కూడా ఏనుగు చిహ్నం ఉంటుంది. తమ కొత్త లోగో కేవలం డిజైన్ మార్పు మాత్రమే కాదని, లక్నో నగరం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, అలాగే తమ అభిమానుల స్ఫూర్తిని ప్రతిబింబించే చిహ్నమని ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో పేర్కొంది.

లక్నో సూపర్ జెయింట్స్ యజమాని శాశ్వత్ గోయెంకా మాట్లాడుతూ, "ఈ కొత్త లోగో మాకు చాలా భావోద్వేగంతో కూడుకున్నది. లక్నో, ఉత్తరప్రదేశ్ ప్రజలు మమ్మల్ని ఎంతగానో ఆదరించారు. వారి ప్రేమకు ఇది నీరాజనం. లోగోలోని గరుడ పక్షి ఉన్నత శిఖరాలకు చేరాలన్న మా ఆశయానికి, కిరీటం అభిమానులు మాపై ఉంచిన గౌరవానికి, ఏనుగు ఈ ప్రాంత ప్రజల బలానికి, విశ్వాసానికి ప్రతీక" అని వివరించారు. ఇది కేవలం గుర్తింపు మార్పు కాదని, నగర గౌరవాన్ని నిలబెట్టి, మనస్ఫూర్తిగా ఆడతామన్న మాటకు కట్టుబడి ఉంటామని ఆయన తెలిపారు.

రిషబ్ పంత్ కెప్టెన్సీలో ఈ సీజన్‌లో లక్నో జట్టు బలంగా కనిపిస్తోంది. నికోలస్ పూరన్, మహ్మద్ షమీ, మిచెల్ మార్ష్ వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో బరిలోకి దిగుతున్న లక్నో, ఈ కొత్త లోగోతోనైనా తమ తొలి ఐపీఎల్ టైటిల్ కలను నెరవేర్చుకోవాలని పట్టుదలగా ఉంది.

## బ్రూక్ అద్భుత సెంచరీ...
# పాక్‌పై ఇంగ్లండ్ థ్రిల్లింగ్ విక్టరీ



**సూపర్ 8 పోరులో పాకిస్థాన్‌పై 2 వికెట్ల తేడాతో గెలుపు**
**చివరి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్**
**165 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో ఛేదించిన ఇంగ్లండ్**
**50 బంతుల్లో 100 పరుగులు చేసిన ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్**
**4 వికెట్లతో రాణించిన పాక్ బౌలర్ షహీన్ అఫ్రిది**



టీ20 ప్రపంచకప్‌లో భాగంగా జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో ఇంగ్లండ్ అద్భుత విజయం సాధించింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (100) అసాధారణ సెంచరీతో చెలరేగడంతో, పాకిస్థాన్‌పై 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆఖరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. పల్లెకెలె వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 165 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్ (0), జోస్ బట్లర్ (2) ఘోరంగా విఫలమయ్యారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హ్యారీ బ్రూక్ ఒంటిచేత్తో ఇన్నింగ్స్‌ను నడిపించాడు. కేవలం 51 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో 100 పరుగులు చేసి జట్టును విజయానికి చేరువ చేశాడు. అయితే బ్రూక్ సెంచరీ తర్వాత ఔటవ్వడంతో మ్యాచ్ ఒక్కసారిగా ఉత్కంఠగా మారింది. ఆ వెంటనే నవాజ్ బౌలింగ్ లో విల్ జాక్స్ (28), జేమీ ఓవర్టన్ (0) కూడా ఒకే ఓవర్లో వెనుదిరగడంతో ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. ఒకానొక దశలో పాకిస్థాన్ గెలుస్తుందనిపించింది. కానీ చివర్లో జోఫ్రా ఆర్చర్ (5) కీలక బౌండరీ బాదడంతో ఇంగ్లండ్ ఊపిరి పీల్చుకుంది. పాక్ బౌలర్లలో షహీన్ అఫ్రిది 4 వికెట్లతో సత్తా చాటాడు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. ఆ జట్టులో సాహిబ్జాదా ఫర్హాన్ (63) అర్ధ సెంచరీతో రాణించాడు. బాబర్ ఆజం (25), ఫఖర్ జమాన్ (25) ఫర్వాలేదనిపించారు.